


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 116 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 8 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 116 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 8 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

- రేవంత్ రెడ్డిని కలిసిన డెలావర్ గవర్నర్ మాట్ మేయర్
- ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలపై చర్చ
- డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని రేవంత్ కు ఆహ్వానం

హైదరాబాద్ పెన్ పవర్:అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ముఖ్యంగా ఆరోగ్యం, విద్య మరియు సాంకేతిక రంగాలలో పరస్పర సహకారంపై కీలక చర్చలు జరిగాయి.వీరి భేటీలో ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలే ప్రధాన ఎజెండాగా నిలిచాయి. డెలావర్ రాష్ట్రంలో

మిగతా 2లో



## గణపతి లొంగిపో.. మీ ప్రాణాలకు మాది భద్రత

### సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

- లొంగిపోయిన మావోలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్న సీఎం
- ఆర్థిక, వైద్య సాయం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ
- చర్చల ద్వారానే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలుగుతామన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ పెన్ పవర్: ఆయుధాలతోనే సమస్యలు పరిష్కారం కావని.. ఎంత పెద్ద సమస్య అయినా చర్చలే పరిష్కారమని సీఎం రేవంత్ అన్నారు. శాంతి మార్గాన్ని మహాత్మ గాంధీ ప్రపంచానికి అందించారని.. శాంతియుతంగా ఓ యుద్ధాన్ని గెలిచిన చరిత్ర మనదని పేర్కొన్నారు. శనివారం (మార్చి 7) సీఎం రేవంత్ రెడ్డి ఎదుట కమాండ్ కంట్రోల్ సెంటర్లో 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుధాలు వీడాలని నేను గతంలో పిలుపునిచ్చానని.. నా పిలుపు మేరకు మావోయిస్టులు లొంగిపోతున్నారన్నారు. మిగిలిపోయిన మావోస్టులు కూడా లొంగిపోవాలని

మిగతా 2లో

## కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

### రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఆగ్రహం



- పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి కర్ణుడే అయితే రైతుబంధు ఎందుకు వేయడం లేదని ప్రశ్న
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారన్న హరీశ్ రావు

హైదరాబాద్ పెన్ పవర్:తాను కర్ణుడిలాంటి వాడినన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,

మిగతా 2లో



## 2043 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీగా ఎదగడమే మా లక్ష్యం

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ లోని సోమాజిగూడలోని పార్క్ హోటల్ లో CII వార్షిక సమావేశం నిర్వహించారు. శనివారం ( మార్చి 7 ) జరిగిన ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్. 2043 నాటికి తెలంగాణ వన్ ట్రిలియన్ ఎకానమీగా ఎదగడమే తమ లక్ష్యమని అన్నారు మంత్రి వివేక్. తెలంగాణను వేగంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. సీఐఐ ఈవెంట్ లో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని..దేశవ్యాప్తంగా క్లీన్ అండ్ గ్రీన్ పరిశ్రమల కోసం సీఐఐ కృషి చేస్తోందని అన్నారు. 65 కొత్త, అధునాతన స్కిల్ డెవిలప్మెంట్ సెంటర్లని తీసుకురాబోతు న్నామని..?ఎలాంటి స్కిల్స్ కావాలన్నది ఇండస్ట్రీ చెప్పాలని.. ఆయా కోర్సులను ఈ సెంటర్ లలో ఇంట్రడ్యూస్ చేస్తామని అన్నారు.

మిగతా 2లో

# హార్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

### మరింత ముదిరిన ఉద్రిక్తతలు

- హార్ముజ్ జలసంధిలో 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ
- శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్
- గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ

హైదరాబాద్ పెన్ పవర్:శ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హార్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

మిగతా 2లో






## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- జయసుధకు ఏఎన్నార్ అవార్డు
- ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
- ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
- ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)

హైదరాబాద్ పెన్ పవర్::2025లో విడుదలైన చిత్రాలకు సంబం ధించి 'గద్దర్ ఫిలిం అవార్డ్స్–2025' విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి

మిగతా 2లో





## కామారెడ్డిలో కలకలం రేపుతున్న చిన్నారుల అదృశ్యం

- రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారులు అదృశ్యం
- మొన్న ఇద్దరు, నిన్న ముగ్గురుఅక్కాచెల్లెల్లు మిస్సింగ్
- సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని కామారెడ్డిలో రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. అదృశ్యమైన వారంతా పదేళ్ల లోపు చిన్నారులే. శుక్రవారం ఇద్దరు, ఈరోజు మరో ముగ్గురు చిన్నారులు అదృశ్యమయ్యారు. ఐదుగురు పిల్లలు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారంతా కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న

మిగతా 2లో


## భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్–2026' ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి

మిగతా 2లో





## సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం.. ప్రపంచంలోనే అత్యధిక జీతం!
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతన ప్యాకేజీ ప్రకటన
- రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు ఆర్జించే అవకాశం
- కంపెనీ పనితీరు ఆధారంగా రెట్టింపు కానున్న స్టాక్ యూనిట్లు
- వేమో, వింగ్ వంటి అటానమస్ వెంచర్ల వృద్ధికి ప్రోత్సాహకాలు

మిగతా 2లో



## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మహిళల హక్కుల పట్ల అవగాహన ఏదీ?

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారు. మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజికం సహా అనేక రంగాల్లో మహిళల భాగ స్వామ్యాన్ని పెంచడంతో పాటు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఈ వేడుకలను జరుపుకుంటారు. అయితే వందేళ్లుగా, ఈ వేడుకలు జరుపుకుంటున్నా, నేటికీ మహిళలు అనేక సమస్యల వలయాలలో కొట్టుమిట్టాడుతునే ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడానికి కార్మిక ఉద్యమం నేపథ్యం ఉంది. 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ పని గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లకు సానుకూలమై, అమెరికాలోని సోషలిస్టు పార్టీ అధికారం లోకి వచ్చాక 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిం చాలన్న ప్రతిపాదన కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జ ర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1917 యుద్ధ సమయంలో రష్యా మహిళలు "ఆహారం – శాంతి" డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా సామ్రాట్ నికోలస్ జా 2 సింహాసనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును కల్పించిన నేపథ్యం ఉంది. మహిళలు ఈ సమ్మెకు దిగిన దినం అప్పట్లో రష్యాలో అనుసరించే జూలియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23 ఆదివారం. అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది మార్చి 8వ తేదీ. అందుకే మార్చి 8వ తేదీన అత్య ధిక దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపు కొంటున్నారు. 1975వ సంవత్సరం లోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించ టం ప్రారంభించింది. ఈ ఏడాది జరిగేది 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్: "సుస్థిరమైన రేపటి కోసం ఈ రోజు లింగ సమానత్వం"... అయితే మహిళ లపై అణచివేతలు కొనసాగు తుండడం నిత్యకృత్యాలే అవుతు న్నాయి. రాజ్యాంగం ఎన్నో హక్కు లు కల్పించినా వాటిపై అవగాహన లేక పోవడంతో మరింత అన్యా యాలకు గురవు తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి. తమపై వివక్షను, వేధింపులను ఎదుర్కోవడానికి వారు ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో మహిళా దినోత్సవం సందర్భంగా తెలుసు కోవాల్సిన అవసరం ఉంది. భారతీయ మహిళలందరికిని సమానత్వం( నిబంధన14), వివక్ష లేకుండుట (నిబంధన 15(1), సమానావకాశాలు కల్పించడం (నిబంధన16), సమాన పనికి సమాన వేతనం (నిబంధన 39(డి), వీటితో బాటు స్త్రీలకు పిల్లలకు అనుకూలంగా ప్రత్యేక నిబంధన లను అనుమతించడం (నిబంధన 15(3), మహిళల గౌరవానికి భంగం కల్గించే ఆచారాలను లేకుండా చేయడం(నిబంధన 51(ఎ) (ఇ), అంతేగాక మహిళలు చేసేపనులలో న్యాయపరమైన, మానవోచిత పరిస్థితులలో రక్షణ కల్పించడం, ప్రసూతి సమయంలో ఉపశ మనానికి (నిబంధన 42) మహిళా రిజర్వేషన్ 73వ రాజ్యంగా సవరణ ప్రకారం సదుపాయాలను అనుమ తించడం వంటి హామీలను భారత రాజ్యాంగం కల్పించింది. సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం, ఒక వ్యక్తి మీద దాడి చేస్తే సదరు వ్యక్తి చనిపోయినా మీకు శిక్ష పడదు. 166(బి) సెక్షన్ ప్రకారం.. బాధితురాలికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స ఇవ్వకపోతే సంబంధిత సిబ్బంది, యాజ మాన్యం మీద కేసు వేయవచ్చు. 228(ఏ) సెక్షన్ ద్వారా లైంగిక దాడికి గురైన మహిళ అనుమతి లేకుండా మీడియాలో ఆమె పేరు, ఫొటోలు ప్రచురించ కూడదు. అలా చేసిన పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవచ్చు. 354 సెక్షన్ ప్రకారం – స్త్రీ శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో చూసినా, తాకినా, అవమాన పర్చినా, అనుమతి లేకుండా ఫొటో, వీడియో తీసినా ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయ వచ్చు. 376 సెక్షన్ కింద18 ఏళ్ల లోపు ఉన్న యువతితో సెక్సులో పాల్గొంటే అది చట్టరీత్యా వ్యతిరేకం. ఒకవేళ ఆమె ఇష్ట ప్రకారమే చేసినా పురుషుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష పడుతుంది. 376 సెక్షన్ కింద వైద్యం కోసం వచ్చిన మహిళను లైంగిక వేధింపు లకు గురిచేస్తే వారిపై చర్య తీసుకు నేందుకు సెక్షన్ ఉపయోగ పడు తూ, ఈ సెక్షన్ కింద కేసు చేస్తే రెండు నెలల్లో విచారణ చేసి తీర్పు ఇవ్వాలి. భార్య ఉండగా.. మరో పెళ్లి చేసుకుంటే 494 సెక్షన్ ప్రకారం అతని మీద కేసు నమోదు చేయవచ్చు. కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్షపడుతుంది. 498(ఏ) సెక్షన్– ఓ వివాహితను ఆమె భర్త కానీ, భర్త బంధువులు కానీ శారీర కంగా, మానసికంగా, హింసించినా, అందుకు ప్రేరేపించినా, ప్రోత్సహించినా ఈ సెక్షన్ కింద కేసు వేయ వచ్చు. కనీసం మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. 509 సెక్షన్ – మహిళలతో అవమానంగా మాట్లాడినా, సైగలు చేసినా, అసభ్యకర వస్తువు లను ప్రదర్శించినా ఈ చట్టం ప్రకారం శిక్షకు అర్హులు. ఒంటరిగా ఉన్నప్పుడు అసభ్యకరంగా పాటలు పాడుతూ, శబ్దాలు చేస్తూ ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 294 ప్రకారం వారిపై ఫిర్యాదు చేయవచ్చు. కనీసం మూడు నెలలకు తగ్గకుండా వారికి జైలుశిక్ష, లేదా కొంత జరిమానా వేయవచ్చు. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా వెక్కిరించినా, అనుకరించినా, వారిపై సెక్షన్ 354(డీ) ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. పనిచేసే ప్రదేశాల్లో తోటి ఉద్యోగులు గానీ, బాస్ గానీ ఆఫీసు పనుల్లో అలుసుగా తీసుకొని సెక్సువల్ కాంటాక్ట్ కోసం ఇబ్బంది పెడితే 2013 వేధింపుల చట్టం ప్రకారం ఫిర్యాదు చేయ వచ్చు. ఒకరి ఫొటోను మార్ఫింగ్ చేసి వారి శరీరాలకు ముఖాన్ని అతికించి ఇబ్బందికరంగా ఇంటర్నెట్‌లో షేర్ చేస్తున్న సంఘటనలలో సెక్షన్ 499 ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షపడవచ్చు. ఒక మహిళను దౌర్జన్యంగా, బలప్రయోగం వల్ల తన శరీరంపై ఉన్న దుస్తులను తీసివేసినా, ఆ వ్యక్తికి సెక్షన్ 354(బీ) ప్రకారం 3నుండి7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. 13/2013 సవరణల చట్టం ద్వారా ఈ సెక్షన్ అదనంగా చేర్చబడింది. ఒక మహిళ, విద్యార్థినికి సంబంధించిన రహస్య వ్యక్తిగత ఫొటోలు తీయడం, వీడియోలు తీసి వాటిని ఇతరులకు పంపించినా 354(సీ) సెక్షన్ కింద ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వ్యభిచారానికి, 18 ఏళ్లలోపు బాలికను కొనుగోలు చేసినా సెక్షన్ 373 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు జరిమానా విధిస్తారు. బాలికను వ్యభిచారానికి మారేందుకు ప్రోత్సహించినా, ప్రలోభ పెట్టినా సెక్షన్ 366(ఏ) కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. నిండు గర్భిణిని చంపాలనే ఉద్దేశంతో చేపట్టిన ఒక చర్య పర్యవసానంగా ఆమె చనిపోతే నేరస్థుడిపై సెక్షన్ 316 ప్రకారం ప్రాణహరణం కింద, నేరం మోప బడుతుంది. ఆమె మరణించడానికి బదులుగా గర్భంలోని శిశువు మరణిస్తే 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఒక బృందంలోని సభ్యులు ఒక మహిళపై లైంగిక దాడి చేసిన సందర్భాల్లోనూ వారిలో ప్రతి వ్యక్తి నేరానికి పాల్పడి నట్లే పరిగణించ బడుతుంది. సెక్షన్ 376–బీ కింద ప్రతి ఒక్కరికీ 20 ఏళ్లు తగ్గకుండా జీవితఖైదు శిక్ష విధిస్తారు. 13/2013 సవరణ చట్టం ద్వారా ఈ సెక్షన్ సవరించబడింది. స్త్రీ, బాలికను గానీ తన ఇష్టానికి వ్యతిరేకంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకునేందుకు బలవంతంగా అంగీకరించాలని ఒత్తిడి తేవడం, ఆ స్త్రీని అపహరిస్తే బలవంతంగా వివాహం చేసుకునే సెక్షన్ 366 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా పడుతుంది. ఇలాంటి చట్టాల ఎన్నో గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలి. అలాగే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ స్త్రీల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలి. సాటి మనుషులుగా మహిళలకు సామాజిక బాధ్యతగా సహకరించాలి.

# కామారెడ్డిలో కలకలం రేపుతున్న చిన్నారుల అదృశ్యం

- మొదటి పేజి తరువాయి
పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.
నిన్న పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన పదేళ్ల సింహాద్రి, తొమ్మిదేళ్ల విజయ్ కనిపించకుండా పోయారు. ఈరోజు ఆర్బీ నగర్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సీపాత్ (8), ఆయాత్ (7), మరియం (5) అదృశ్యమయ్యారు. ఈ ముగ్గురు పిల్లలు తండ్రి ఆటోలో దుకాణానికి వెళ్లారు. తండ్రి వారిని దుకాణం వద్ద దింపి కిరాయికి వెళ్లాడు. కానీ ముగ్గురు ఆ తర్వాత కనిపించలేదు.

# సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌అండ్‌పీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి.
కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# గణపతి లొంగిపో.. మీ ప్రాణాలకు మాది భద్రత

- మొదటి పేజి తరువాయి
కోరుతున్నామని.. అజ్ఞాతంలో ఉన్న వారు జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. 130 మంది మావోల లొంగుబాటలో అధికారుల పాత్ర కీలకమని.. ప్రాణ హాని లేకుండా పోలీసులు భద్రత కల్పించారని పేర్కొన్నారు. నక్సలైట్లకు నమ్మకం కల్పించింది పోలీసులేనని చెప్పారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేతలతో తాను మాట్లాడానని.. సీపీఐఎంల్?ను రద్దు చేస్తామని టాప్ లీడర్ దేవ్ జీ తనతో చెప్పారని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారన్నారు. దేవ్‌జీ, దామోదర్‌తో సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామని.. సెంట్రల్ కమిటీ ప్రతిపాదనలు కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టులు లొంగిపోయేందుకు సానుకూల వాతావరణం కల్పిస్తుందన్నారు. మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆరోగ్యం, ప్రాణాలకు తెలంగాణ ప్రభుత్వం భద్రతా కల్పిస్తుందని హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆర్థిక భరోసా, ఆరోగ్యభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. లొంగిపోయిన నక్సలైట్లకు భూమి ఇచ్చే అంశంపై ఇప్పుడే ఏమి చెప్పలేనని అన్నారు. ఇక, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు రాజకీయ పార్టీల్లో చేరడం, చేరకపోవడం వాళ్ల ఇష్టమన్నారు. ఒకవేళ ఎవరైనా కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవ్వాలనుకుంటే గాంధీ భవన్ లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరొచ్చని తెలిపారు.

# రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

- మొదటి పేజి తరువాయి
తాము విజయవంతంగా అమలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ కార్యక్రమాల గురించి మాట్ మేయర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా అందరికీ నాణ్యమైన వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ కేర్' విధానంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక యుగంలో అతి ముఖ్యమైన అంశాలైన సమాచార భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగంలో పాటించాల్సిన నిబంధనలపై కూడా ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, ఇక్కడి మౌలిక సదుపాయాలను అభినందించిన గవర్నర్ మాట్ మేయర్, భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక మరియు సాంకేతిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇదే క్రమంలో, తెలంగాణ నుండి ఒక అధికారిక ప్రతినిధుల బృందంతో
కలిసి డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని, రెండు రాష్ట్రాల మధ్య కుదుర్చుకోబోయే భవిష్యత్ ఒప్పందాల గురించి ప్రాథమిక చర్చలు జరిపారు.

# కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

- మొదటి పేజి తరువాయి
ముఖ్యమంత్రి కర్ణుడు కాదని, కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. తనను తాను కర్ణుడితో పోల్చుకుంటున్న ముఖ్యమంత్రి మహాక్రూరుడు అని మండిపడ్డారు. కర్ణుడు మాటతప్పని వాడని, తన కవచ కుండలాలను కూడా దానం చేసిన త్యాగధనుడని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడిలాంటి వాడే అయితే రైతు బంధు ఏది, ఇళ్లు కూలగొట్టి విధ్వంసం సృష్టించడం ఎందుకని నిలదీశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్, ఆరు గ్యారెంటీ హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసానికి కేరాఫ్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విమర్శలు చేయడంపై ఉన్న దృష్టి రైతుల కష్టాల మీద లేదని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చవచ్చని హరీశ్ రావు అన్నారు. ఎందుకంటే ఎన్నికలు రాగానే ఆయన నిద్రలేస్తారని, ఎన్నికలయ్యాక కేసీఆర్, బీఆర్ఎస్ మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు వేసిందని గుర్తు చేశారు.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరపున, ఇరాన్ ప్రజల తరపున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# హార్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

- మొదటి పేజి తరువాయి
షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హార్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హార్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

# 2043 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీగా ఎదగడమే మా లక్ష్యం

- మొదటి పేజి తరువాయి
ఇటీవల జరిగిన సమ్మిట్ ద్వారా తెలంగాణకు భారీ పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు. పెట్టుబడుల వల్ల భారీగా ఉద్యోగావకాశాలు వస్తాయని స్పష్టం చేశారు మంత్రి వివేక్. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కూడా చాలా ముఖ్యమని.. ఇండస్ట్రీలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. చిగాసి ఇండస్ట్రీ తర్వాత కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నామని... ఇదంతా కార్మికుల సంక్షేమం కోసమేనని అన్నారు మంత్రి వివేక్. పరిశ్రమలు ప్రభుత్వ గైడ్ లైన్స్ పాటించాలని కోరుతున్నానని అన్నారు. కార్మికుల కోసం కేంద్రం కొత్త చట్టం తెచ్చిందని.. వాటిని ఇంప్లిమెంట్ చెయ్యాలని అన్నారు. కార్మికులు బాగుంటేనే... ఇండస్ట్రీలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు మంత్రి వివేక్.

# భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- మొదటి పేజి తరువాయి
.గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్జ్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు.
నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

# చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- మొదటి పేజి తరువాయి
డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పెషల్ అవార్డులు:**
ఎన్టీఆర్ జాతీయ అవార్డు – చిరంజీవి
ఏఎన్నార్ అవార్డు – జయసుధ
పైడి జయరాజ్ అవార్డు – కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు – అశ్వనిదత్

**ఫీచర్ ఫిల్మ్స్:**
ఉత్తమ చిత్రం – రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం – దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం – ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
ఉత్తమ నటుడు – నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి – రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు – సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ బాలనటుడు – మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ సహాయ నటుడు – శివాజీ
ఉత్తమ సహాయనటి – భూమిక (యూఫోరియా)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ – తండేల్
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా – కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం – సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ డాక్యుమెంటరీ – యూనిటీ
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు – సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం – అనగనగా
ఉత్తమ సంగీత దర్శకుడు – మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు – అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని – సాహితీ (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత – గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్‌ప్లే – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ లిరిసిస్ట్ – నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ – శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్).
ఉత్తమ సినీ గ్రంథం: ప్రభు (శూన్యం నుండి శిఖరాగ్రాలకు)
ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు

# సింగపూర్ విమానానికి బాంబు బెదిరింపు




**శంషాబాద్: పెన్ పవర్:**ఓ విమానంలో బాంబులు ఉన్నాయని ఎయిర్‌పోర్ట్‌కు ఈ మెయిల్ సందేశం వచ్చిన సంఘటన హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటు చేసుకుంది. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఎస్‌క్యూ-519 విమానం శంషాబాద్ నుంచి 155 మంది ప్రయాణికులతో ఉదయం 10.55 గంటలకు టేకాఫ్ తీసుకోవాలి. తనిఖీలన్నీ పూర్తిచేసుకొని విమానం ఎక్కడానికి బోర్డింగ్ గేట్ వద్ద ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆ విమానంలో బాంబులు ఉన్నాయని గుర్తుతెలియని వ్యక్తి పంపించిన ఈ మెయిల్‌ను అధికారులు గమనించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే విమానాన్ని ఎయిర్‌సైడ్ బృందం అధికారులు నిర్జన ప్రదేశానికి తరలించి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పేలుడు స్వభావం ఉన్న ఎలాంటి పదార్థాలు విమానంలో దొరకలేదు. ప్రయాణికులందరికీ ఓ హోటల్‌లో వసతి కల్పించారు. అనంతరం 13 గంటలు ఆలస్యంగా ప్రయాణికులతో విమానం సింగపూర్‌కు బయలుదేరింది. జీహెచ్ఐఏఎల్ అధికారుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**23 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో హైదరాబాద్ నుంచి శనివారం గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించాల్సిన 23 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయని విమానాశ్రయం అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దోహా, షార్జా, దుబాయ్, అబుదాబి, బహ్రెయిన్, దమ్మామ్, కువైట్ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన 12 విమానాలు, శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 11 విమాన సర్వీసులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న భీకర దాడులు తగ్గుముఖం పట్టే వరకు.. దుబాయి నుంచి రాకపోకలు సాగిస్తున్న ఎమిరేట్స్ విమాన సర్వీసులను పూర్తిగా నిలిపివేస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.







# తెలంగాణలో గుడిసెలు కనిపించొద్దు..

## అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా.. ఇందులో లక్ష ఇండ్లకు ఈ నెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు చేయనున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సెక్రెటేరియట్‌లోని తన కార్యాలయం నుంచి ప్రజాపాలన-ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ పీడీలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నదని.. ఇది ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతున్నదని వెల్లడించారు. త్వరలోనే గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇండ్లలో 20 శాతం వరకు గ్రౌండింగ్ కాలేదని.. అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి 31లోపు అన్ని గ్రౌండింగ్ అయ్యేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో రెండో దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేనాటికి మొదటి దశ ఇండ్లు కొలిక్కిరావాలని సూచించారు.

-4లో

# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ..

## కడియం, దానంల కేసుల్లో తీర్పు రిజర్వ్

- సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ ముగించిన స్పీకర్
- 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్
- కడియం, దానంల భవితవ్యంపై ఉత్కంఠ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం క్లైమాక్స్ కు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పక్షాన చేరిన పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు తుది విచారణ ముగించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగుస్తుండటంతో స్పీకర్ తీసుకున్న నిర్ణయం కీలకంగా మారింది. ఇందులో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్, వారిపై ఉన్న పిటిషన్లను కొట్టివేశారు. అయితే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసుల్లో మాత్రం తీర్పును రిజర్వ్ చేశారు. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# వరంగల్‌లోని ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం




**హైదరాబాద్ పెన్ పవర్:**వరంగల్ నగరంలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జేపీఎన్ రోడ్డులోని దత్తాత్రేయ ఫర్నిచర్ షాప్‌లో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# ఏసీబీకి చిక్కిన భారీ అవినీతి తిమింగలం

**కరీంనగర్: పెన్ పవర్:**భారీ అవినీతి తిమింగలం ఏసీబీ అధికారుల వలకు చిక్కింది. తహసీల్దార్‌గా పని చేస్తూ భారీగా ఆస్తులు కూడబెట్టుకున్న అధికారిని అవినీతి నిరోధకశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న కమతం శ్రవణ్‌కుమార్, ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణలపై కరీంనగర్‌లోని హిందూపూర్ కాలనీలోని ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుడి నివాసంతో పాటు మరో 2 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు. పలు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బంగారు ఆభరణాలు, నగదు విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



# ప్రపంచస్థాయి ఏఐ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ స్థాయి కృత్రిమ మేధా (ఏఐ) ఆవిష్కరణ కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఆధ్వర్యంలో బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) కళాశాలలో సీఎఫ్ఓ సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. భాగ్యనగరాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలైన వ్యాన్‌గార్డ్, యూబీఎస్, వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జేపీ మార్గాన్ చేస్, గోల్డ్‌మ్యాన్ శాక్స్, సిటీ గ్రూపు వంటి ప్రఖ్యాతి సంస్థలు నగరంలోని పలు చోట్ల ఇంజినీరింగ్ ఆవిష్కరణ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# మహిళలను శక్తివంతం చేస్తేనే సమాజం బలపడుతోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పోరాటం, పట్టుదల, ప్రతిభను గుర్తించి గౌరవించే రోజు మహిళా దినోత్సవమని పేర్కొన్నారు. మహిళలకు అవకాశాలు ఇస్తే కుటుంబం ఎదుగుతుందని, మహిళలను శక్తివంతం చేస్తే సమాజం బలపడి దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. శనివారం సీతక్క ఒక ప్రకటనలో పేర్కొంటూ, మహిళల ఆర్థిక సాధికారత, సంక్షేమం, స్వయం ఉపాధి, సామాజిక భద్రత లక్ష్యంగా తమ ప్రభుత్వం సమగ్ర కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి కోట్ల రూపాయల బ్యాంకు రుణాల వరకు, స్వయం ఉపాధి నుంచి మహిళా వ్యాపార ప్రోత్సాహం వరకు, సంక్షేమం నుంచి స్వావలంబన వరకు అనేక పథకాల ద్వారా మహిళల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొస్తున్నామన్నారు.రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేడ్కర్ చెప్పినట్లు ఒక సమాజం అభివృద్ధి స్థాయిని తెలుసుకోవాలంటే ఆ సమాజంలో మహిళల స్థితిని చూడాలని గుర్తుచేశారు. మహిళలకు గౌరవం ఇవ్వడం అనేది ఉపకారం కాదని, అది సమాజం నిర్వహించాల్సిన బాధ్యత అన్నారు. మహిళల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదన్నారు. మహిళలు ఎదిగితే దేశం ఎదుగుతుంది అనే భావనతో ప్రతి ఒక్కరూ గివ్?టూ గెయిన్? అనే ఆలోచనను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలంగాణలో గుడిసెలు కనిపించొద్దు..

-3 పేజి తరువాయి

**ధరలను నియంత్రించాలి..**

ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరా పెంచేందుకు స్థానికంగా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచిత ఇసుక పంపిణీ చేస్తున్నదని.. లబ్ధిదారులకు ఎక్కడా సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్లను మంజూరు చేసి ఒకటి లేదా రెండు విడతల చెల్లింపులు చేసిన తర్వాత వివిధ కారణాలతో చెల్లింపులు నిలిపివేయడం సరికాదన్నారు. ఇటువంటి చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని లేని పక్షంలో అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. రెండో విడతలో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

# తప్పుడు ప్రచారం ఆపాలి: ఎంపి చామల

**హైదరాబాద్ పెన్ పవర్:** కేటీఆర్,హరీష్ రావు,బీజేపీ నాయకులకు భువనగిరి ఎంపి చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రోగ్రామ్ ను ప్రారంభించింది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పూర్తి అయ్యాయి. రెండు ఏళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలు ఏమనుకుంటున్నారు అనే దానిపై ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా తెలుసుకోనున్నారని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారు. కానీ హరీష్ రావు,కేటీఆర్ యధావిధిగా ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లవద్దని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మదిలో ఉండకూడదు అనేది కేటీఆర్,హరీష్ రావు కుట్ర. అధికారం కోల్పోతామని ఎన్నడూ కేటీఆర్,హరీష్ రావు అనుకోలేదు. అధికారం మాకు శాశ్వతంగా ఉంటుంది అని కేటీఆర్, హరీష్ రావు ఆలోచనగా ఉండేది. రెండున్నర ఏళ్ల పాలనపై ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్తుందనే ఆవేదన హరీష్ రావు,కేటీఆర్ లో ఉంది. బిఆర్ఎస్ హయాంలో ప్రగతి భవన్ కట్టి ప్రగతి లేని పాలన ప్రజలకు అందించారు. పదేళ్ళలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ఫామ్ హౌస్ లో మీరు మీ కుటుంబ సభ్యులు మాట్లాడుకోవడం తప్ప ఎప్పుడైనా మంత్రులు,ఎమ్మెల్యేలతో మాట్లాడారా అని ప్రశ్నించారు. మిగులు రాష్ట్రాన్ని బిఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. చీకటి జీవోల ద్వారా ఎన్ని అప్పులు చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారు. బిఆర్ఎస్ అధికారంలో కోల్పోయే నాటికి జీత భత్యాలు,పెన్షన్లు బకాయిలు పెట్టి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు శ్రమిస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు రోజు మొరిగినా ప్రజలు పట్టించుకోరు. కేటీఆర్,హరీష్ రావు రోజు మాట్లాడినంత మాత్రాన ప్రభుత్వం పడిపోదు. అంతిమంగా న్యాయ నిర్ణేతలు తెలంగాణ ప్రజలు. మమ్మల్ని నమ్మి గెలిపించిన ప్రజల కోసం పని చేయాల్సిన భాధ్యత మా పైన ఉంది. కేటీఆర్,హరీష్ రావు,బీజేపీ నాయకులు ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం కావాలి. ఓడిపోయినంత మాత్రాన దూరంగా ఉండాల్సిన అవసరం లేదు.జిల్లా సభలు,గ్రామ సభల్లో పాల్గొనాలి. కేటీఆర్,హరీష్ రావు,బీజేపీ కలిసి సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం బంద్ చేయాలి. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సూచనలు,సలహాలు ఇవ్వాలని అన్నారు.

## కాళేశ్వరం నీళ్లు వాడుకుంటూ ప్రాజెక్టు లేదంటారు..

# ఇంతకంటే సిగ్గుచేటు ఉందా

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ పర్యటనలో భాగంగా కురిక్యాల వద్ద కొండన్నపల్లి వరద కాలువను మాజీ మంత్రి హరీశ్ రావు గారు పరిశీలించారు. ఆయన వెంట మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, స్థానిక మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు ఉన్నారు. కాలువ పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్ రావు.. పొద్దున లేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రేవంత్ రెడ్డి గారు పదేపదే అబద్ధాలు చెబుతున్నారు. మరి ఈ నిమిషానికి వరద కాలువలో పారుతున్న నీళ్లు కాళేశ్వరం నీళ్లు కాదా?

లక్ష్మీ పంప్ హౌస్ మోటార్లు నడుస్తుంటేనే కదా ఈ నీళ్లొచ్చాయి?

ప్యాకేజీ 6, ప్యాకేజీ 8 కింద మోటార్లు పెట్టి, టన్నెల్స్ పనులు పూర్తి చేసి, వరద కాలువను ఒక రిజర్వాయర్‌గా మార్చి.. చొప్పదండి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, బాల్కొండ నియోజకవర్గాలకు అద్భుతంగా సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లు వాడుకుంటున్నారు, కాళేశ్వరం మోటార్లు నడుపుతున్నారు, ఆ నీళ్లతోనే పంటలు పండుతున్నాయి.. కానీ బయట మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టే లేదని చిల్లర మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తికి సిగ్గుచేటు.వరద కాలువలో పారుతున్న నీళ్లు, ఆ కాలువ మీద ఆధారపడి పండుతున్న లక్షలాది ఎకరాల పంటలు కాళేశ్వరం పుణ్యం కాదా?మిడ్ మానేరుతో పాటు అనంతగిరి, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్లలో నింపిన జలాలు కాళేశ్వరం నీళ్లు కావా..ఈ రిజర్వాయర్ల కింద పండుతున్న



పంటలన్నీ కాళేశ్వరం జలాలతోనే కదా..కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదు. అందులో 100 కంపోనెంట్లు ఉన్నాయి. 3 బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 18 సబ్‌స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1600 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు.. ఇవన్నీ కలిపితేనే కాళేశ్వరం ప్రాజెక్టు అని కాంగ్రెస్ నేతలు తెలుసుకోవాలి.కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండానే రాష్ట్రంలో వరి పండుతోందని రేవంత్ రెడ్డి చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనం. 2022 సంవత్సరంలోనే దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దింది కేసీఆర్ గారే.మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, హుజురాబాద్ ప్రాంతాల్లో నేడు కళకళలాడుతున్న పంటలన్నీ కాళేశ్వరం చలవే.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండున్నరేళ్లలో ఒక్క కాలువ తవ్వలేదు, ఒక్క చెక్ డ్యాం నిర్మించలేదు, ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. కనీసం కాలువల తవ్వకానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదు.

# అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం లో పాల్గొని.పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశాలలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహం.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మహబూబ్నగర్ శాసనసభ్యులు ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి .వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ .మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఊబేదుల్ల కోత్వాల్ .రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి.ఐదు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.అటవీ శాఖకు సంబంధించిన చిన్న సమస్యల పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అవి ఏళ్ల తరబడిగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆయన మంత్రిగారు దృష్టికి తీసుకువచ్చారు.జిల్లా హాస్పిటల్స్ లో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే వారిని హైదరాబాద్ సిఫారసు చేస్తున్నారని ఆస్పత్రులలో కావలసిన అన్ని సదుపాయాల ఏర్పాటు కోసం మంత్రిగారి దృష్టి సారించారని ఆయన కోరారు.సమృద్ధిగా యూరియా ఉన్న చిన్న చిన్న సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆన్లైన్ బుకింగ్ లాంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బేస్మెట్ లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో పూర్తిస్థాయి అవగాహన లేదని లబ్ధిదారులకు అందుకు సంబంధించిన అవగాహన కల్పించేలా చూడాలని ఆయన సూచించారు.వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో ఒకలాగా మరికొన్ని ప్రాంతాల్లో ఇంకోలా ఉందని అలాంటి

సమస్య లేకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు.ప్రజా రవాణాలకు సంబంధించి ఆటోలలో ఇతరత్రా రవాణా వాహనాలలో ఎక్కువమందిని కూర్చోబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈూ అధికారులు దృష్టి సారించి ప్రమాదాల నివారణ పై చర్యలు తీసుకోవాలన్నారు.ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ఉత్పత్తులను భారతదేశంలోకి దిగుమతులు చేసి మన దేశ రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేకుండా నష్టాలపాలు చేసే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు రైతు సంఘం జిల్లా నాయకులు జి దాసు డిమాండ్ చేశారు శనివారం నాడు మండలంలోని శివపురం తపాలా కార్యాలయంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖలు రాయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఒప్పందం అమెరికాకు లాభాదాయకమని ఆ దేశ వ్యవసాయ శాఖ మంత్రి బ్రూకె లెస్లీ రోలిన్స్ ప్రకటించారు మన ప్రధానమంత్రి గాని వ్యవసాయ శాఖ మంత్రి గాని నోరు మెదపడం లేదు కనీసం పార్లమెంటు సమావేశాలలో సైతం మాట్లాడడం లేదు ఈ ఒప్పందం వల్ల అమెరికా నుండి మన దేశానికి దిగుమతి అయ్యే పారిశ్రామిక వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా రద్దు అవుతాయి ఏటా తొమ్మిది లక్షల కోట్ల విలువైన వస్తువులు ఆహార పదార్థాలు దిగుమతి అవుతాయి గోధుమలు మొక్కజొన్న ప్రత్తి సోయాబీన్ పండ్లు కూరగాయలు ప్రాసెస్ అయిన ఆహార పదార్థాలు పాల ఉత్పత్తులు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి కావడం వల్ల మన రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాల పాలవుతారన్నారు ఈ ఒప్పందం అమలు లోకి వస్తే మన దేశంలో 11 కోట్ల రైతుల కుటుంబాలు 9 కోట్ల పాడి రైతుల కుటుంబాలు దివాలా తీస్తాయని మన దేశం నుండి ఎగుమతి అయ్యే వస్తువులపై 2.5% ఉన్న పన్ను 18 శాతానికి పెంచుతారని ఈ పనుల వల్ల మన రైతుల పండించిన మిర్చి పొగాకు రొయ్యలు శనగలు మామిడి ధరలు పడిపోయి రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు మన దేశానికి రైతాంగానికి నష్టమైన భారత్-అమెరికా దయ పాక్షిక వాణిజ్య ఒప్పందంపై ప్రధానమంత్రి సంతకం పెట్టవద్దని ఆదేశించాలని రాష్ట్రపతికి ద్రౌపతి ముర్ముకు ఆంధ్రప్రదేశ్ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేఖలు రాయడం జరిగింది అన్నారు కేంద్ర ప్రభుత్వం c2G 50 ప్రకారం రైతుల పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వకపోగా కేరళ ప్రభుత్వం వరికి ఇచ్చే బోనస్ ని నిలిపి వేయాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించడం దుర్మార్గమన్నారు ఇప్పటికైనా అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని అన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**కోదాడ, మార్చి 7 పెన్ పవర్:** పెన్ పహాడ్ లో గురువారం రాత్రి కుటుంబ తగాదాల నేపథ్యంలో మచ్చ మట్టమ్మ అనే మహిళపై దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడిన ఆమె సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## అన్నదమ్ములకు సివిల్స్ ర్యాంకులు

**తుంగతుర్తి, మార్చి 7 పెన్ పవర్:** నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన అన్నదమ్ములు వెలిమినేటి విజయ్సింహా రెడ్డి (682) మరియు వెలిమినేటి విక్రమసింహారెడ్డి (541) సివిల్స్ పరీక్షల్లో ర్యాంకులు సాధించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లోనూ వీరు విజయం సాధించారు. అన్న ఎంపీడీఓగా, తమ్ముడు అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారిగా శిక్షణ పొందుతున్నారు. వ్యవసాయదారులు అయిన వీరి తల్లిదండ్రులు, చదువుకోకపోయినా తమ కుమారులు ఉన్నత స్థాయిలో ఉండాలనే ఆకాంక్షతో ప్రోత్సహించారని తల్లి అలివేలు తెలిపారు. ఇద్దరూ తమ ఆరో ప్రయత్నంలో సివిల్స్ సాధించడం విశేషం. వీరి సోదరి అర్చన ఇన్ఫోసిస్ లో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదం

**హుజూర్‌నగర్, మార్చి 7 పెన్ పవర్:** నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ఎదుట ఏఆర్ కానిస్టేబుల్ శివ గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయారు. అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ అతన్ని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా, ఢీకొట్టడంతోనే పడిపోయినట్లు వాదనకు దిగారు. ఈ ఘటనపై టూటౌన్ ఎస్సై ఎర్ర సైదులు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బరంగ్ ఏడ్డి గ్రామంలో కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ

**బాన్సువాడ, మార్చి 7 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా, బాన్సువాడలోని బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్డి గ్రామంలో శనివారం చాకలి సునీత అనే లబ్ధిదారురాలికి ఐదవ వార్డు సభ్యురాలు పుల్కంటి గంగవ్వ కల్యాణలక్ష్మి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉన్నంతకాలం పనులకు ఆటంకం ఉండదని, ఆయన సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదేపురం గంగన్న, కుమ్మరి గంగారాం, మేత్రి నాగుగొండ, హట్కారి దశరథ్, క్యాదని లింగప్ప, బోయి లాలయ్య, మొండ్కారి వీరప్ప, సందుల రవి పాల్గొన్నారు.

## రైతన్నలకు ఎరువుల కష్టాలు...

## క్యూలో మళ్ళీ చెప్పులు

**కామారెడ్డి, మార్చి 7 పెన్ పవర్:** రైతు సంఘాల నేతలు ప్రభుత్వాలపై మండిపడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతులకు సకాలంలో ఎరువులు అందించకపోవడం విచారకరమని వారు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్ సొసైటీలో రైతులు ఎరువుల కోసం పడుతున్న పాట్లు దీనికి నిదర్శనమని తెలిపారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల కాళ్ళపై పడే నాయకులకు ఇప్పుడు రైతుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతుల దీన పరిస్థితిపై, మార్పు తెస్తామని చెప్పి విఫలమైన ప్రభుత్వం తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కామారెడ్డిలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

**ఎల్లారెడ్డి, మార్చి పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా, బిబిపేట మండలంలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ప్రతి శనివారం ఉదయం 8 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి హిందూ బంధువులు, హనుమాన్, అయ్యప్ప మాలధారణ స్వాములు, సోదర సోదరీమణులు, పెద్దలు అందరూ పాల్గొనాలని కోరడమైనది.

## ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి

**జుక్కల్, మార్చి 7 పెన్ పవర్:** గొట్టిముక్కుల మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాగొంటి స్వామి అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతి పట్ల స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచి సంజీవ్, పంచాయతీ సభ్యులు, నాయకులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్వయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన మున్సిపల్ వైస్ చైర్మన్

**షాద్‌నగర్, మార్చి 7 పెన్ పవర్:** షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని 14వ వార్డులో ప్రగతి ప్రణాళిక చర్యలలో భాగంగా ఆయన స్వయంగా పరిశుభ్ర కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. సిబ్బందికి ప్రోత్సాహకరంగా వైస్ చైర్మన్ మోహన్ స్వయంగా చెత్తను తొలగించి, తన చేతితో చెత్తను తీసిపారేశారు. ఆడంబరాలకు వెళ్లకుండా స్వయంగా ఆడుతూ పాడుతూ శ్రమదానం చేయడంతో ప్రగతి ప్రణాళిక చర్యల కార్యక్రమానికి ఆయన హైలెట్ గా నిలిచారు. పురపాలికలో 99 రోజుల ఈ కార్యక్రమాన్ని ఆయన స్థానికులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

## అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు

**ఇబ్రహీంపట్నం, మార్చి 7 పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతి పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా, షాద్‌నగర్ 24వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అగ్గనూరు విశాల విశ్వం మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, 24వ వార్డును అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని, 99 రోజుల ప్రణాళికలో భాగంగా వార్డులోని అన్ని సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

## సోమాజిగూడ వైన్‌షాప్‌లో అగ్నిప్రమాదం

**ఖైరతాబాద్, మార్చి 7 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్‌లో శనివారం తెల్లవారుజామున ఓ వైన్‌షాప్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్ కారణంగానే జరిగిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## వికారాబాద్ జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి

**వికారాబాద్, మార్చి 7 పెన్ పవర్:** వికారాబాద్ జిల్లాలో భూగర్భజలాలు వేసవి ప్రారంభం లోనే క్రమంగా తగ్గుతున్నాయి. ఫిబ్రవరి చివరి నాటికి 12.87 మీటర్లకు చేరాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా దుద్యాల మండలంలో 29.54 మీటర్లకు భూగర్భజలాలు అడుగంటిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటి నిర్వహణను విస్మరించింది. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోతే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరికలు వెలువడుతున్నాయి.

# మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర

**వరంగల్, మార్చి 7, పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర మొదలయింది. నిండు పున్నమి కాంతుల్లో అడవి తల్లి పులకిస్తోంది. డోలు వాయిద్యాల మోత, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామంలో వెలిసిన 'కొమ్మాలమ్మ' జాతర భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మేడారం సమ్మక్క-సారలమ్మల తరహాలోనే గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ వనదేవతకు 11వ శతాబ్దం నాటి ఘనమైన చరిత్ర ఉంది. సాధారణంగా దైవం అంటే విగ్రహ రూపంలో ఉంటారు. కానీ, కొమ్మాలమ్మ తల్లి ఇక్కడ కత్తి రూపంలో దర్శనమివ్వడం ఒక విశిష్టమైన సంప్రదాయం. ఆదివాసీ దేవతలందరిలో కెల్లా పెద్ద దేవతగా కొమ్మాలమ్మను కొలుస్తారు. ఒకప్పుడు గోదావరి తీరంలో వెలిసిన ఈ తల్లి, కాలక్రమేణా 'వాసం' వంశీయుల ఆరాధ్య దైవంగా ఎంచగూడ ప్రాంతానికి చేరుకుంది. ఈ దైవానికి యాలం,ఆలూరి వంశీయులు ప్రధాన పూజారులుగా వ్యవహరిస్తారు. పూర్వం ఈ ఖడ్గాన్ని తిరిగి గోదావరి ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయగా, అరిష్టాలు సంభవించడంతో భక్తులు భయపడి తిరిగి ఎంచగూడలోనే ప్రతిష్టించారని చరిత్ర చెబుతోంది.కొమ్మాలమ్మ కేవలం దేవత మాత్రమే కాదు, ఆదివాసీల పాలిట ఒక ప్రకృతి శాస్త్రవేత్తగా విరాజిల్లుతోంది. రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తల్లి ముందే హెచ్చరిస్తుందని భక్తుల నమ్మకం. గద్దెపై ఉన్న ఖడ్గానికి తగిలించిన వెండి కంకణాలు కదిలి గలగలమంటూ శబ్దం చేస్తే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, ఒకవేళ కంకణాలు బిగుసుకుపోయి నిశ్శబ్దంగా ఉంటే వర్షాలు తక్కువని గిరిజనులు భావిస్తారు. వర్షాలు లేని సమయంలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తే కచ్చితంగా వానలు కురుస్తాయని వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే అత్యంత భక్తి విశ్వాసాలతో దీనిని జరపుకుంటారు.సమ్మక్క సారలమ్మలకు బెల్లాన్నిసమర్పించినట్లుగా, కొమ్మాలమ్మ తల్లికి వెండి కంకణాన్ని కానుకగా సమర్పించడం ఇక్కడి ప్రధాన ఆచారం. ముఖ్యంగా సంతానం లేని వారు తల్లిని వేడుకుంటే ఫలితం నిశ్చయమని భక్తుల నమ్మకం. కోరిక తీరిన దంపతులు తమ కృతజ్ఞతగా తల్లికి వెండి కంకణాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.ప్రతి రెండేళ్లకు ఒకసారి కోనాపురం అడవుల నుండి సేకరించిన ప్రత్యేక వెదురు కంకలు, ఎర్రని జెండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సమ్మక్క బండారి వంశానికి చెందిన వారు కాగా, కొమ్మాలమ్మ కూడా అదే బండారి వంశీయుల మహాశక్తిగా పూజలందుకోవడం విశేషం. అగ్ని రూపంలో గద్దెపైకి చేరే వనదేవత, అడవి బిడ్డల కష్టాలను తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కారు బోల్తా, ఆరుగురికి తీవ్ర గాయాలు

**జహీరాబాద్, మార్చి 7 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద శనివారం తెల్లవారుజామున 65వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## ఆరు కిలోల గంజాయి స్వాధీనం

**పటాన్‌చెరు, మార్చి 7 పెన్ పవర్:** పటాన్ చెరు మండలం ముత్తంగి జాతీయ రహదారిపై శనివారం పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా, తనిఖీల్లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో గంజాయి తరలిస్తున్న మణికుమార్, విశాల్, అనిల్ అనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

## సంగారెడ్డి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

**నారాయణఖేడ్, మార్చి 7 పెన్ పవర్:** శనివారం సంగారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూన పనిత మాట్లాడుతూ, రాబోయే ఐదేళ్లలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టి, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ షఫీ అహ్మద్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## జిల్లాలో 38.5 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**నాగర్‌కర్నూల్, మార్చి 7 పెన్ పవర్:** వేసవి ఆరంభంలోనే జిల్లాలో ఎండలు తీవ్రమయ్యాయి. గడిచిన 24 గంటల్లో పెంట్లవెల్లి మండలం జటప్రోలులో అత్యధికంగా 38.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. యంగంపల్లి, తిమ్మాజీపేటలో 38.4డిగ్రీలు, ఊర్కొండలో 38.2డిగ్రీలు గా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' అమలుపై మంత్రి జూపల్లి సమీక్ష

**కొల్లాపూర్, మార్చి 7 పెన్ పవర్:** కొల్లాపూర్ ఎమ్మెల్యే, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన? ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని సూచించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు..

**అచ్చంపేట, మార్చి 7 పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ అన్నారు. నడింపల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లను ఆయన ప్రారంభించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని, గత ప్రభుత్వాలు డబుల్ బెడ్ రూం ఇళ్ల హామీలకే పరిమితమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## కారు బైక్ ఢీ-ఇద్దరికి గాయాలు

**కల్వకుర్తి, మార్చి 7 పెన్ పవర్:** వెల్దండ మండలంగుండాల గ్రామ సమీపంలో రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని అంకమోనికుంటకు చెందిన ఒర్సు మహేశ్, చందు గాయపడ్డారు. 108 అంబులెన్సు ద్వారా వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మహేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**నాగర్‌కర్నూల్, మార్చి 7 పెన్ పవర్:** కొల్లాపూర్ మండలం రామానాగరాజుపురం గ్రామానికి చెందిన నాగరాజు (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్న నాగరాజు, నాలుగు నెలల గర్భవతి అయిన భార్య అనారోగ్యానికి గురైనప్పుడు పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు గురువారం మాచినేనిపల్లికి వెళ్లి వస్తానని చెప్పి, కొల్లాపూర్ సమీపంలోని గుట్టపై చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

## పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

**సూర్యాపేట, మార్చి 7 పెన్ పవర్: ఆత్మకూర్(ఎస్)** మండలంలోని కందగట్లలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పుల్లయ్య, మేడబోయిన కృష్ణ, రాజబోయిన భద్రమ్మ, యాదమ్మ అనే నలుగురు వ్యక్తులను కుక్క కరవడంతో వారు గాయపడ్డారని స్థానికులు తెలిపారు.

# రాజశేఖర్ రెడ్డి తర్వాత రేవంతే...

**హైదరాబాద్, మార్చి 7, పెన్ పవర్:** తెలంగాణ నేతలకు హైకమాండ్ గా సీఎం రేవంత్ రెడ్డి మారారు. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపడం ద్వారా రేవంత్ రెడ్డి హైకమాండ్ వద్ద తన పట్టు నిరూపించుకున్నారు. తనపై అసంతృప్తి గళం వినిపిస్తున్న వారికి గట్టిసందేశం పంపారు. తెలంగాణ కాంగ్రెస్ కు సంబంధించినంత వరకూ అంతా తన కనుసన్నల్లోనే ఉంటుందని ఎవరైనా తోక జాడిస్తే రాజకీయ భవిష్యత్ ఉండదన్నంత పట్టు సాధించినట్లుగా చెప్పకనే చెప్పారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు.. తెర వెనుక ఏమైనా చేయాలనుకున్నా సైలెంటుగా గా ఉండటం .. కుదిరితే రేవంత్ భజన ప్రారంభించడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. రేవంత్ చాలా స్వల్ప కాలంలోనే పార్టీని గుప్పిట్లోకి తెచ్చుకున్నారని అందరూ అంచనాకు వస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఒకప్పుడు గ్రూపు రాజకీయాలు, సీనియర్ల అసమ్మతి గళాలు సర్వసాధారణం. కానీ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే రేవంత్ రెడ్డి పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడంలో సఫలమయ్యారు. కీలక పదవులన్నీ తన కనుసన్నల్లోనే భర్తీ అయ్యేలా చూసుకుంటున్నారు. ఢిల్లీలోని అధిష్టానం వద్ద తన మాటే శాసనమని ఆయన నిరూపించుకున్నారు. రేవంత్ రెడ్డి కేవలం పాలనకే పరిమితం కాకుండా, పార్టీ అంతర్గత వ్యవహారాలపై పూర్తి స్థాయి పట్టు సాధించారు. ఒకప్పుడు రేవంత్ నాయకత్వాన్ని వ్యతిరేకించిన సీనియర్లు సైతం ఇప్పుడు ఆయన కనుసన్నల్లో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా వ్యతిరేక గళం వినిపిస్తే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న హెచ్చరికను రేవంత్ తన వ్యూహాల ద్వారా స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ పార్టీలో



నేనే హైకమాండ్ అనే స్థాయికి ఆయన ఎదిగారు, ఇది గత దశాబ్ద కాలంలో ఏ కాంగ్రెస్ ముఖ్యమంత్రికీ సాధ్యపడలేదు.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి ఫైర్ బ్రాండ్ నేతలు కూడా ప్రస్తుతం రేవంత్ రెడ్డి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో విభేదాలు ఉన్నప్పటికీ, రేవంత్ సాధించిన రాజకీయ విజయం చూశాక, ప్రస్తుతానికి ఆయనతో కలిసి వెళ్లడమే శ్రేయస్కరమని వారు భావిస్తున్నారు. తెర వెనుక ఎన్ని ప్రయత్నాలు చేసినా, రేవంత్ వ్యూహాల ముందు అవి ఫలించడం లేదని అర్థం చేసుకున్న నేతలు.. ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటం లేదా రేవంత్ భజన వైపు మళ్లడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.రేవంత్ రెడ్డి బలం కేవలం రాష్ట్రానికే పరిమితం కాలేదు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల వద్ద ఆయన సంపాదించుకున్న నమ్మకం అసాధారణం. రాష్ట్రం నుండి ఏ నిర్ణయం వెళ్లినా దానికి ఢిల్లీ ఆమోదముద్ర వేస్తుండటంతో, స్థానిక సీనియర్లు హైకమాండ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశాలు మూసుకుపోయాయి. వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ సీటు దక్కడం అనేది రేవంత్ రెడ్డి ఢిల్లీ లాబీయింగ్‌లో సాధించిన అతిపెద్ద

విజయంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సాధారణ కార్యకర్తల్లో రేవంత్ రెడ్డి పట్ల ఉన్న ఆదరణే ఆయనకు కొండంత అండగా నిలుస్తోంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రత్యర్థులను రాజకీయంగా దెబ్బతీయడంలో ఆయన చూపిస్తున్న చొరవ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. పార్టీని ఒక కార్పొరేట్ తరహాలో క్రమశిక్షణతో నడిపిస్తూనే, తనను వ్యతిరేకించే శక్తులను ఒక్కొక్కటిగా ప్రక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ శకం మొదలైందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

# సుందరీకరణ దిశగా చెరువులు

**హైదరాబాద్, మార్చి 7, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో కనుమరుగవుతున్న చెరువులకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా 'హైడ్రాసంస్థ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. అన్యాక్రాంతమైన, కలుషితమైన చెరువులను ప్రక్షాళన చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా.. తాజాగా మరో రెండు చెరువుల సుందరీకరణను పూర్తి చేసింది. శివరాంపల్లిలోని 'బమ్-రుక్న్-ఉద్-దౌలా' చెరువుతో పాటు, కూకట్‌పల్లిలోని 'నల్ల చెరువు'ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరో ఐదారు రోజుల్లో అధికారికంగా ప్రారంభించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ వెల్లడించారు.కూకట్‌పల్లి నల్ల చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనుల తుది దశను కమిషనర్ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి చెరువును సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువు కట్ట చుట్టూ భారీగా నీడనిచ్చే చెట్లను నాటాలని, పార్కులను మరింత అందంగా ముస్తాబు చేయాలని అధికారులకు సూచించారు. మురుగునీరు నేరుగా చెరువులో కలవకుండా జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని, నల్ల చెరువు వద్ద ఒక సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుపై కూడా ఆయన చర్చించారు.చెరువుల ప్రక్షాళనతో పాటు స్థానిక ప్రజల ఆహ్లాదం కోసం చెరువుల చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆయా ప్రాంతాల్లో వరద ముప్పు పూర్తిగా తొలగిపోవడమే కాకుండా, భూగర్భ జలాల మట్టం కూడా గణనీయంగా పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో హైడ్రా పనులు మొదలుపెట్టినప్పుడు విమర్శలు చేసిన వారే, నేడు ఈ సుందరీకరణను చూసి ప్రశంసిస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా

చేపట్టిన తొలి విడతలో ఇప్పటికే అంబర్‌పేట 'బతుకమ్మ కుంట'ను సీఎం ప్రారంభించగా.. ఉప్పల్ నల్ల చెరువు, తమ్మిడికుంట, సున్నం చెరువుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తదుపరి విడతలో మరో 13 చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులను హైడ్రా భారీ ఎత్తున చేపట్టనుంది

# తెలంగాణలో సహకార క్లబ్ లు

**వరంగల్, మార్చి 7, పెన్ పవర్:** సహకార వ్యవస్థపై యువతలో అవగాహన పెంచే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఒక వినూత్న కార్యక్రమానికి అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో విద్యావ్యవస్థతో అనుసంధానంగా ప్రత్యేకంగా 'సహకార క్లబ్‌లను' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాబోయే వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు ఈ రంగంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సహకార శాఖ సన్నాహాలు ముమ్మరం చేసింది.ప్రస్తుతంరాష్ట్రంలో వ్యవసాయ, చేనేత, మత్స్య, గృహ నిర్మాణ, పారిశ్రామిక, ఉద్యోగ తదితర రంగాల్లో కలుపుకుని దాదాపు 52 వేలకు పైగా సహకార సంఘాలు సేవలు అందిస్తున్నాయి. కొత్తవాటి ఏర్పాటు కోసం నిత్యం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ సొసైటీల నిర్వహణ, ప్రభుత్వ రాయితీలు, చట్టపరమైన నిబంధనలపై చాలామంది నిర్వాహకులకు సరైన అవగాహన ఉండటం లేదు. దీనివల్ల నిర్వహణలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ లోటును భర్తీ చేసి, భవిష్యత్తులో సహకార సంఘాలను అత్యంత సమర్థవంతంగా నడిపే నాయకత్వాన్ని, అవగాహన ఉన్న పౌరులను విద్యార్థి దశ నుంచే తయారు చేయాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం అమలు కోసం సహకార శాఖ ఉన్నతాధికారులు త్వరలోనే అన్ని వర్సిటీలు, డిగ్రీ కాలేజీల యాజమాన్యాలకు అధికారిక మార్గదర్శకాలతో లేఖలు రాయనున్నారు. ప్రతి కళాశాల నుంచి చదువు పట్ల ఆసక్తి ఉన్న 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ క్లబ్‌లను స్థాపిస్తారు (చివరి సంవత్సరం విద్యార్థులకు ఇందులో మినహాయింపు ఉంటుంది). ఎంపికైన వారికి వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు నిపుణులైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోల

ద్వారా సహకార వ్యవస్థ విశిష్టత, సేవలపై సమగ్రంగా బోధిస్తారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం.. ఆదర్శవంతంగా నడుస్తున్న రాష్ట్ర సహకార బ్యాంకు , విజయ డెయిరీ, ములకనూర్ సొసైటీల సందర్శనకు నేరుగా తీసుకెళ్తారు. ఈ నెల రోజుల శిక్షణకు క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక భృతి (స్టైపెండ్) కూడా అందజేయనుంది.

# బహుజనుల ఆత్మగౌరవ పతాక

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల త్యాగాలు, భాగస్వామ్యాలు కూడా మరువ లేనివి. అలాగే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ ఒక త్యాగశీలి భాగస్వామ్యం చాలా మందికి తెలియనిది.ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఝాన్సీ రాణి. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు ఒక చరిత్ర. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటిష్ పాలనకు లొంగక, వారికి తన రాజ్యం స్వాధీన పరచడానికి ససేమిరా ఇష్ట పడక, రాజ్య రక్షణ కోసం జరిగిన యుద్ధంలో ఝాన్సీ వీరోచిత పోరాటం, వీర మరణం గురించి అందరికీ తెలిసిందే. ఈ పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయికి నమ్మిన బంటుగా, విశ్వాస పాత్రురాలిగా, ఆత్మార్పణం గావించిన ఒక వీరదళిత నారి గురించి చాలా మందికి తెలియదు. ఆమె ఝల్కారీబాయి... ఝల్కారీబాయి గురించి తెలుసుకోక పోవడం చరిత్రకు అన్యాయం జరిగినట్లే భావించాలి. ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి లక్ష్మీబాయి.1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవ కారులకు నిలయంగా మారింది. లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమీకరించడం ద్వారా ఆత్మరక్షణ బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇవ్వనారంభించింది. ఆమె దగ్గర సైన్యాధ్యక్షులుగా ఉన్న వారంతా ఆమె యుద్ధం చేస్తున్న కారణానికి మద్దతుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారే. సెప్టెంబరు, అక్టోబరు 1857 లో ఆమె ప్రక్క రాజ్యాలైన దతియా, ఓర్చా రాజ్యాల నుంచి దాడిని విజయవంతంగా ఎదుర్కొన గలిగింది.హిందువులకు ఆవు పవిత్రం, ముస్లింలకు, పంది అసహ్యం. కానీ ఆంగ్లేయులు వాడే తూటాలకు ఆవుకొవ్వును, పందికొవ్వును వాడేవారు. అది సహించలేని సిపాయిలలో తిరుగుబాటు మొదలయ్యింది. ఇది గ్రహించిన ఆంగ్లేయులు హిందువులను, ముస్లింలను అనేక ఇబ్బందులకు గురిచేసారు. అది సహించలేని సిపాయిలు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేయాలని సంకల్పించు కున్నారు. రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోగా పారిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి తాంత్యాతోపే మొదలైన తిరుగుబాటు దార్లతో చేయి కలిపి ఢిల్లీ, కాన్పూరు, ఔధ్ , ఝాన్సీతో పాటు అన్నీ ప్రాంతాలలో ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయించు కున్నారు. కానీ బ్రిటీష్ వారు పెట్టిన బాధలకు ఓర్వలేని మంగల్ పాండే అనే భారత సిపాయి తిరుగుబాటు చేయడంపై ఆంగ్లేయులు అప్రమత్తమై ఝాన్సీరాణిని నిర్బంధించి ఝాన్సి రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు. ఇది భారత చరిత్రలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం. భారతనారీ క్షేత్రంలో మచ్చుతునక ఝాన్సీ లక్ష్మీబాయి. అయితే ఈ సమరంలో ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర మరువ లేనిది. ఝల్కారీబాయి (నవంబరు 22, 1830 ? 1858) భారతీయ మహిళా సైనికురాలు. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఝాన్సీ యుద్ధంలో ప్రముఖపాత్ర పోషించింది. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలోని మహిళా విభాగంలో సైనికురాలు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిపాయి తిరుగుబాటుగా, 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధిగాంచిన 1857–58 నాటి వీరోచిత పోరాట ఘట్టంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ప్రతిరూపంగా కీలక భూమికను పోషించిన ఘనత దళిత బహుజన భూమి పుత్రిక ఝల్కారిబాయికే దక్కుతుంది. బుందేల్‌ఖండ్ ప్రాం తంలో ప్రజలు పాడుకునే జానపద బాణీల్లో ఝాన్సీలక్ష్మీబాయి సరసన ఝల్కారిబాయి సాహసాలను పాటల రూపంలో నేటికీ గుర్తు చేసుకోవడం విశేషం. ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు నిరుపేద వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి వీరనారిగా ఎదిగి, నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాకగా మారింది. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిన ఘటన సంచలనం రేపింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్‌ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించింది. సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రు సేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టుముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకుని కల్పి ప్రాంతంలో పోరాడుతున్న తిరుగుబాటు నాయకులను కలుసు కోవడానికి అనువుగా, ఝల్కారీబాయి తానే ఝాన్సీ లక్ష్మీబాయి నంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, తదనంతర కాలంలో ఆమెను విడిచిపెట్టారా లేదా చంపేశారా అన్నది చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1858 జూన్ 17,లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. ఈ ఝల్కారిబాయి సాహసంతో స్ఫూర్తి పొందిన దళిత బహుజన రాజకీయ పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఝల్కారిబాయి జీవితాన్ని, పోరాట ఘట్టాలను నాటకాలు, కథలుగా మలచి ఊరూరా ప్రచారం చేయడం జరిగింది. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గమనార్హం.

# హస్తిన కాలింగ్...



**హైదరాబాద్, మార్చి 7, పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీకి పిలవడం ఇప్పుడు హస్తం పార్టీలోనే కాదు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మొన్న వికారాబాద్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ..స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీ వచ్చి కలవమని చెప్పారట. పార్టీ శిక్షణా తరగతుల వేదికైన వికారాబాద్ నియోజకవర్గానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆయన రాహుల్ గాంధీకి స్వాగతం పలకడంతో పాటు వీడ్కోలు చెప్పేందుకు హెలిప్యాడ్ దగ్గరికి వెళ్లిన సందర్భంగా..ప్రసాద్ కుమార్‌తో మాట్లాడిన రాహుల్ ఢిల్లీకి వచ్చి కలవమని ప్రత్యేకంగా చెప్పారని తెలుస్తోంది.స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను రాహుల్ గాంధీ ఎందుకు ఢిల్లీకి పిలిచారన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో రకరకాలుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, అందులోనూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ స్వయంగా ఢిల్లీ రమ్మని స్పెషల్‌గా స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను పిలిచారంటే సమ్‌థింగ్ ఈజ్ దేర్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏదో బలమైన కారణం లేకుండా రాహుల్ ఎవరినీ ఢిల్లీకి వచ్చి కలవాలని చెప్పరని, అలాంటిది స్పీకర్ పదవిలో ఉన్న ప్రసాద్ కుమార్‌ను హస్తినకు రావాలని పిలిచారంటే కచ్చితంగా ఏదో ఉందని హస్తం పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.ఈ మధ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాలా బిజీగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు కేసులను విచారిస్తున్నారాయన. సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో జంపింగ్ ఎమ్మెల్యేల విచారణను స్పీడప్ చేసిన స్పీకర్ ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇక కడియం శ్రీహరి విచారణ పూర్తి కాగా తీర్పును రిజర్వ్ చేశారు. మరోవైపు ఇంకా దానం నాగేందర్ కేసు తుది విచారణను బాకీ ఉంది. ఇలా పార్టీ ఫిరాయింపుల కేసు విచారణతో స్పీకర్ ప్రసాద్ కుమార్ బాగా విసిగిపోయారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ స్పీకర్ తీరుపై విమర్శలు గుప్పిస్తోంది. ఇక మరో ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎలాంటి తీర్పు ఇస్తారన్నదానిపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారమంతా స్పీకర్ ప్రసాద్‌కు హెడెక్‌గా మారిందట. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కూడా ప్రసాద్ కుమార్‌కు తలకు మించిన భారంగా మారిందన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి సిచ్యువేషన్‌లో రాహుల్ గాంధీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీకి పిలవడం వెనుక రీజనేంటన్నదానిపై ఉత్కంఠ నెలకొందిపార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్స్‌పై విచారణ క్లైమాక్స్‌కు చేరుకున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించేందుకు పిలిచి ఉంటారా అన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మంత్రివర్గంలో ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అమాత్య పదవుల కోసం చాలా మంది ఆశలు పెట్టుకోగా.. అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రేసులో ఉన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారటమంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు ప్రసాద్ కుమార్ హైకమాండ్ కు లేఖ రాశారు. కానీ అప్పుడు క్యాబినెట్‌లో ఆయనకు చోటు దక్కలేదు. అయితే మంత్రిపదవిపై ప్రసాద్ కుమార్ ఇంకా ఆశలు పెట్టుకున్నారట. ఇలాంటి ఈక్వేషన్స్ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చి కలవమని రాహుల్ గాంధీ చెప్పడంతో గడ్డం ప్రసాద్‌లో మళ్లీ ఆశలు చిగురించాయని అంటున్నారు. మరి స్పీకర్‌ను రాహుల్ ఢిల్లీకి పిలిచింది మంత్రివర్గంలో బెర్త్ కోసమా? లేక ఫిరాయింపు అంశంపై చర్చించేందుకా? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్ వర్గాలతో పాటు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఉత్కంఠ రేపుతోంది.అయితే ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై డిస్కస్ చేస్తే..రాహుల్‌తో భేటీ తర్వాత స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతోంది? మంత్రి వర్గంలో చోటు కోసమైతే గడ్డం ప్రసాద్ ప్లేస్‌లో స్పీకర్ అయ్యేదెవరనేది కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రసాద్‌కుమార్‌ను క్యాబినెట్‌లోకి తీసుకుంటే..ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్న ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందంటున్నారు. రాహుల్‌తో స్పీకర్ భేటీ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి.

# అజార్ ను ముంచుతారా... ఉంచుతారా..

**హైదరాబాద్, మార్చి 7, పెన్ పవర్:**
తెలంగాణకు కొత్త గవర్నర్ వచ్చారు. ముగ్గురు గవర్నర్లు మారినా ప్రొఫెసర్ కోదండ రాం ఎమ్మెల్సీ పదవి మాత్రం ఇంకా ఊగిసలాటలోనే వుంది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ కూడా ఎమ్మెల్సీగా ఎన్నికవడానికి గడువు దగ్గరపడుతోంది. వారి పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన సిఫారసులు ఈ గవర్నరైనా ఆమోదించి చట్టసభ సభ్యులయ్యే అవకాశమిస్తారో లేదో అనే టెన్షన్ కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. తెలంగాణ జేఏసీ కన్వీనర్, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం శాసన మండలిలో అడుగుపెట్టే అదృష్టం చాలా కాలంగా ఊగిసలాడుతూ వస్తోంది. రెండు సార్లు ప్రభుత్వం ఆయన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ కు సిఫారసుచేసినా, గవర్నర్ ఓసారి ఆమోదించినా న్యాయపర చిక్కులు ఆయన ప్రమాణస్వీకారానికి అడ్డుపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ ను, కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా సిఫారసులు పంపింది. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వారి పేర్లను తిరస్కరించారు. ఇద్దరికీ రాజకీయ పార్టీతో ప్రత్యక్ష సంబందాలున్నాయనీ, ఏ రంగంలోనూ నిష్ణాతులు కాదు కాబట్టి ఆ పేర్లను తాను ఆమోదించలేనని చెప్పారు. ఇంతలో కేసీఆర్ ప్రభుత్వం మారి రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. గవర్నర్ నిర్ణయం పై దాసోజు హైకోర్టును ఆశ్రయించారు. క్యాబినెట్ చేసిన సిఫారసులను తిరస్కరించే అధికారం గవర్నర్ కు ఉండదని హైకోర్టులో పిటిషన్ లో పేర్కొన్నారు. 2023 డిసెంబర్ లో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత సిఫారసులను వెనక్కు తీసుకుని కొత్తగా ప్రొఫెసర్ కోదండరాం, పాత్రికేయుడు ఆమిర్ అలీ ఖాన్ లను ఎమ్మెల్సీగా ప్రతిపాదించారు. ఈసారి గవర్నర్ వారి పేర్లకు ఆమోదం కూడా తెలిపారు. దాసోజు శ్రవణ్ పిటిషన్ ను విచారించిన హైకోర్టు 2024 మార్చిలో గవర్నర్ తమిళిసై నిర్ణయాన్ని తప్పుపట్టింది. గవర్నర్ కు క్యాబినెట్ సిఫారసులను తిరస్కరించే అధికారం లేదని చెప్తూ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ ల నామినేషన్ చెల్లదని చెప్పింది. హైకోర్టు నిర్ణయం పై సుప్రీం కోర్టు మొదట స్టే ఇచ్చింది. దీంతో ప్రక్రియ మళ్లీ మొదలైంది, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కోదండరాం, అజరుద్దీన్ ల పేర్లను గవర్నర్ కోటాకింద సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు 2025 ఆగస్టులో మునుపటి వ్యాఖ్యలపై తదుపరి వివరణ ఇస్తూ ప్రభుత్వ సిఫారసు చేసిన పేర్లకు నిబంధనలు పాటిస్తూ గవర్నర్ ఆమోదం తెలిపినా అది కోర్టు తుది తీర్పునకు లోబడే చెల్లుబాటవుతుందని చెప్పింది.సుప్రీకోర్టు తుది తీర్పునకు లోబడే అనే నిబంధన నేపథ్యంలో అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉన్నారు. మరి ఇప్పుడు నూతన గవర్నర్ గా శివ్ ప్రతాప్ శుక్లా ఆధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఈయన ఏంచేస్తారు. కొత్త గవర్నర్ ను ఒప్పించి ఆమోదించుకోవడంలో రేవంత్ సఫలీకృతులవుతారా.. లేదా మూడో సారి కోదండరాం పేరును సిఫారసు చేయాల్సుంటుందా. జారుద్దీన్ విషయంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఆయన ప్రస్తుతం శాసనసభలో కానీ, మండలిలో కానీ సభ్యుడు కాకుండానే అక్టోబర్ 31, 2025 న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగం ప్రకారం, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల లోపు ఆయన ఏదో ఒక సభలో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలి. ఒకవేళ కొత్త గవర్నర్ కూడా ఈ ఎమ్మెల్సీ నామినేషన్‌ను ఆమోదించకపోతే లేదా జాప్యం చేస్తే, గడువు ముగిసిన తర్వాత అజారుద్దీన్ తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రొఫెసర్ కోదండరాం పేరు కూడా అనేక మలుపులు తిరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సిఫార్సు చేసిన పేర్లను గవర్నర్ తిరస్కరించడం, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాం పేరును ప్రతిపాదించడంపై కోర్టుల్లో కేసులు నడిచాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఈ నియామకాలపై స్టే లేదని స్పష్టం చేసినప్పటికీ, గవర్నర్ సంతకం పెడితేనే అది అధికారికం అవుతుంది. ప్రభుత్వం తన మిత్రపక్ష నేత అయిన కోదండరాంను పెద్దల సభకు పంపడం ద్వారా కీలక రాజకీయ సందేశం ఇవ్వాలని భావిస్తోంది.కొత్త గవర్నర్ ప్రభుత్వం పంపిన సిఫార్సులను యథాతథంగా ఆమోదిస్తే రేవంత్ రెడ్డి సర్కార్‌కు పెద్ద ఊరట లభిస్తుంది. ఒకవేళ గవర్నర్ మళ్ళీ ఏవైనా కొర్రీలు పెడితే మాత్రం, అది ప్రభుత్వం వర్సెస్ రాజ్‌భవన్ వివాదానికి దారితీయడమే కాకుండా, మైనారిటీ కోటాలో మంత్రిగా ఉన్న అజారుద్దీన్ పదవికి ఎసరు తెచ్చే అవకాశం ఉంది. మార్చి 19న సుప్రీంకోర్టులో ఈ విషయమై తదుపరి విచారణ ఉండటంతో, ఆలోపే గవర్నర్ నిర్ణయం వెలువడుతుందో లేదో వేచి చూడాలి.ఇప్పటికే మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసి చట్టసభ సభ్యుడయ్యేందుకు నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్న అజర్ భవితవ్యం ఏంటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. దాసోజు శ్రవణ్ మాత్రం మా పిటిషన్ పండింగ్ లో వుండగా కొత్త గవర్నర్ కూడా ఆమోదం తెలపలేరంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే మంత్రి పదవికి అజర్ అర్హత కోల్పోయే ప్రమాదం పొంచివున్నట్టే.

## సివిల్స్‌లో సత్తా చాటిన ఇల్లందు బిడ్డ

**ఇల్లందు, మార్చి 7 పెన్ పవర్:** ఇల్లందుకి చెందిన బానోతు లక్ష్మి, 'కష్టేఫలి' అనే మాటకు నిదర్శనంగా నిలిచారు. ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఆమె 178వ ర్యాంకు సాధించి విజయం సాధించారు. బానోత్ వెంకటరమణ, తులసమ్మల కుమార్తె అయిన లక్ష్మి, మూడుసార్లు విఫలమైనా పట్టు వదలకుండా నాలుగో ప్రయత్నంలో ఈ ఘనత సాధించారు. గతంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లి త్రుటిలో అవకాశం కోల్పోయినా, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి విజయం సాధించారు.

## జాతీయ రహదారిపై కారు బోల్తా

**పినపాక, మార్చి 7 పెన్ పవర్:** కూసుమంచి మండలంలోని జజ్జులరావుపేట సమీపంలో సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన జాఫర్ అన్సారి (65) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. జాఫర్ అన్సారి తన స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన అన్సారిని 108 వాహనంలో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## కార్పొరేటర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో మురుగు కాలువల శుభ్రత

**కొత్తగూడెం, మార్చి 7 పెన్ పవర్:** కొత్తగూడెం 24వ డివిజన్ కార్పొరేటర్ పొలమూరు ధనలక్ష్మి శనివారం ఉదయం చెమన్ బస్తీ, బర్మా క్యాంపు ప్రాంతంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువలను స్వయంగా పర్యవేక్షించి శుభ్రం చేయించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను నమోదు చేసుకుని, సకాలంలో పరిష్కరిస్తున్న కార్పొరేటర్ ధనలక్ష్మిని ప్రజలు అభినందిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**భద్రాచలం, మార్చి 7 పెన్ పవర్:** సత్తుపల్లి మండలం సదాశివునిపేటలో రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. సిద్ధారం గ్రామానికి చెందిన గంధం మనోజ్ (16), గద్దల కార్తీక్ (18) బైక్‌పై మర్లపాడు వెళ్లి వస్తుండగా, సదాశివునిపేట శివాలయం సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మనోజ్, కార్తీక్ అక్కడికక్కడే మరణించారు.

## పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యం

**పరకాల, మార్చి 7 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలో శనివారం చైర్ పర్సన్ శ్రీమతి పెండెం లక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ శ్రీ గంధం నరేందర్ గుప్తా పర్యటించారు. 3వ వార్డు కౌన్సిలర్ ముత్తినేని వెంకన్నతో కలిసి వార్డుల్లోని సమస్యలను గుర్తించి, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటన నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు జరిగింది.

## అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోండి.



**భూపాలపల్లి, మార్చి 7 పెన్ పవర్:** భూపాలపల్లి మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ బౌతు శోభ రాజేష్, శనివారం వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు గుడ్లు, పోషకాహారం అందజేశారు. ప్రజలు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అంగన్వాడీ నిర్వాహకులు నూతన కౌన్సిలర్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంజీఎం డైట్ వద్ద కుక్కల స్వైర విహారం

**ములుగు, మార్చి 7 పెన్ పవర్:** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతూ రోగులను, వైద్యులను భయపెడుతున్నాయి. డైట్ ఆహార తయారీ కేంద్రంలోకి ప్రవేశించి ఆహారాన్ని తింటూ, కంటైనర్లలో మూతులు పెడుతున్నాయి. దీనివల్ల కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో మృత శిశువును కుక్కలు తినేసిన ఘటన కూడా ఇక్కడ జరిగింది.

## ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

**మహబూబాబాద్, మార్చి 7 పెన్ పవర్:** ములుగు జిల్లాలో శనివారం మంత్రి సీతక్క పర్యటించారు. ములుగు మండలం దేవగిరిపట్నంలో రూ.10 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం చింతలపూడి వినోద అనే లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల పైకి దూసుకెళ్లిన లారీ

**డోర్నకల్, మార్చి 7 పెన్ పవర్:** హనుమకొండ భీమారం బస్టాప్ వద్ద అతివేగంతో వచ్చిన లారీ ముందుగా ఒక ఆటోను ఢీకొని, ఆ తర్వాత విధుల్లో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో కన్నం రాణి కాలు పూర్తిగా నుజ్జుకాగా, మంద విక్టోరియాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ జనార్దన్ చేయి విరిగింది. సమాచారం అందిన వెంటనే 108 సిబ్బంది సురేశ్, కోటిలింగం స్పందించి బాధితులను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన మండల అధికారి

**పాలకుర్తి, మార్చి 7 పెన్ పవర్:** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల పరిధిలోని నరసింగాపురం గ్రామంలోని దుర్గమ్మ గుడి నుండి రిజర్వాయర్ గేట్ వరకు కాలువ పక్క కందకం పూడికతీత పనులను శనివారం ఉపాధి హామీ మండల అధికారి కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు వారు చేయాల్సిన పని విధానాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్లీజ్ సమ్మయ్య, కూలీలు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఒకరికి జైలు శిక్ష

**మంచిర్యాల, మార్చి 7 పెన్ పవర్:** తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడంలో భాగంగా చెల్లని చెక్కు ఇచ్చినందుకు మంచిర్యాల రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కరీంనగర్ కు చెందిన అంజయ్యకు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. 2017లో మంచిర్యాల హమాలి వాడకు చెందిన గంగరాజు వద్ద అంజయ్య రూ. 1,60,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు బౌన్స్ అవ్వడంతో ఈ తీర్పు వెలువడింది. అంజయ్య తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# రాష్ట్ర స్థాయి సాఫ్టాల్ పోటీలకు ఎంపిక



**బెల్లంపల్లి, మార్చి 7 పెన్ పవర్:** బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబాద్ నీలికొండలో ఈనెల 7 నుంచి 9 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ప్రిన్సిపాల్ విజయ సాగర్ ఈ విషయాన్ని తెలిపారు. విశ్వతేజ, కృషి ఇంద్ర వర్మ, సుశాంత్, శ్రీహర్షవర్ధన్, సంకీర్త సాయి, చైతన్య, విజయచంద్రులు ఈ పోటీలలో పాల్గొంటారు.

# జిఎం కార్యాలయంలో అకౌంట్ పై జిఎం సమీక్ష

**చెన్నూరు, మార్చి 7 పెన్ పవర్:** మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఏరియా అకౌంట్ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రతి ఖాతాను జాప్యం లేకుండా, తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్కే ప్రసాద్, బాలాజీ, అశోక్ కుమార్, ఇతర ఏరియా అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**సిర్పూర్, మార్చి 7 పెన్ పవర్:** శనివారం దహేగాం మండలంలోని ఐనం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించి, పరిసరాలను వారానికి ఒకసారి శుభ్రం చేయించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు రప్పించాలని ఆదేశించారు.

# దస్నాపూర్ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**ఆసిఫాబాద్, మార్చి 7 పెన్ పవర్:** ఆసిఫాబాద్ పురపాలక సంఘం పరిధిలోని దస్నాపూర్ 2, 3 వార్డుల్లో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం జరిగింది. పరిసరాల శుభ్రత, చెత్త తొలగింపు, దోమల నివారణకు స్ప్రే, వ్యాధుల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టారు. చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొని అవగాహన కల్పించారు.

## కొత్త ధాం రాజ్ పల్లిలో సీసీ కెమెరా ప్రారంభం

**కోరుట్ల, మార్చి 7 పెన్ పవర్:** మల్లాపూర్ మండలంలోని కొత్త ధాం రాజ్ పల్లి గ్రామంలో రాపుల్స్ యూత్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ నూతన సీసీ కెమెరాను శనివారం రోజున సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి, ఉప సర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వంశీధర్ రెడ్డిలు ప్రారంభించారు. యూత్ ఆధ్వర్యంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నరేందర్, శ్రీనివాస్, నాయకులు సుధాకర్ రెడ్డి, ఆది రెడ్డి, రాజేందర్, రాజ రెడ్డి, మధు, యూత్ సభ్యులు రాకేష్, అన్వర్, తిరుపతి, నర్సయ్య, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




**జగిత్యాల, మార్చి 7 పెన్ పవర్:** జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్ వద్ద స్వర్గీయ వుటూరి గంగారం సరోజన జ్ఞాపకార్థం వుటూరి వాసు సౌమ్య, నిత్య జన గణ మన మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి శనివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు చల్లని నీరు అందించే ఈ చలివేంద్రం ఏర్పాటును వారు అభినందించారు.

## వ్యాన్ ఢీకొని తీవ్ర గాయాలు

**ధర్మపురి, మార్చి 7 పెన్ పవర్:** జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బండారి ప్రణీత్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. దూర విద్య డిగ్రీ పరీక్ష రాసి తిరిగి వెళ్తున్న అతన్ని ఎదురుగా వస్తున్న ప్రైవేటు పాఠశాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు గాయమైన ప్రణీత్‌ను జగిత్యాల ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. పట్టణ ఎస్సై సదాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


## 99 రోజులకు సిద్ధం: కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి 7 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లాలో '99 రోజుల కార్యక్రమం' అమలుకు యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కరీంనగర్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నూతన సర్పంచులు, కౌన్సిలర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ బృహత్తర కార్యక్రమం జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## ప్రజా పాలన కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్: ):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాధ రామేశ్వర్ అధికారులకు సూచించారు. సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, వివిధ విభాగాల అధికారులకు, సిబ్బందికి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహించి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూచించిన ఫార్మాట్‌లలో నివేదికలను సమయానికి సమర్పించాలని ఆదేశించారు.




# పట్టుదలకు ప్రతిరూపం ఆమె

**హైదరాబాద్ పెన్ పవర్:** సృష్టిలో సగం ఆమె. ఆమే కదా సంతాన లక్ష్మి. ఇంటి గడపకు పసుపు పారాణి ఇల్లాలు. గృహ పందిరికి ఆమె ఆకుపచ్చ మామిడి తోరణం. సంసార సంద్రంలో ఆమె ఒక నిర్మల ప్రశాంత అల. నవ్వులు పంచే త్యాగమయి అర్ధాంగి. ఆర్థికాభివృద్ధికి ఐశ్వర్య లక్ష్మి. గృహ కోవెలలో కొలువైన దేవత. ఆమె లేనిదే ఇంట్లో క్షణమైన గడవదు. గళం విప్పకుండా అవిశ్రాంతంగా శ్రమ చేసే పని రాక్షసి ఆమె. ఆకాశమంత ఓపిక, భూదేవి అంత సహనం ఆమె స్వంతం. ఆమె కుటుంబ సంక్షేమ నిధి. మగాడి గుండె సవ్వడి. ఆమె లేనిదే అన్నం ముద్ద దిగదు. ఆమె అలిగితే గృహమంతా అంధకారం. మహిళ మహిమాన్విత శక్తి రూపిణి. అష్టలక్ష్ముల నిలువెత్తు రూపం అతివ. పురుషాధిక్య సమాజానికి తల్లి వేరు పడతి. అందరి శ్రేయస్సు కోరే ఆదిలక్ష్మి. పట్టుదలకు ఆమె ప్రతిరూపం. సహనశీల మహిళ గృహసీమకు సంతోషాల హరివిల్లు. అన్నీ తానై ఇంటిని నడిపించే అతివ చుట్టూ అన్నీ ముళ్ల కంచెలే. ఇల్లే స్వర్గం అయిన వనితకు వంటిల్లు నిర్బంధ కారాగారం. ఆమె జీవితం కష్టనష్టాలు నిండిన దుఃఖ సాగరం. లింగ వివక్ష కోరల్లో చిక్కుకున్న మహిళ సమస్యల సుడిగుండంలో అనాదిగా కొట్టుమిట్టాడుతూనే ఉంటున్నది. ప్రపంచ మహిళ ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో, సవాళ్లు మరెన్నో. లింగ వివక్ష, గృహ హింస. వరకట్న దురాచారం, బాల్య (బాలికల) వివాహాలు, లైంగిక వేధింపులు, మానభంగ పర్వాలు, అవిద్య, అనారోగ్యం, పోషకాహార లోపం, వృత్తి ప్రదేశంలో వేధింపులు, ఆర్థిక అసమానతలు, రాజకీయ రంగంలో అసమానతలు, మీడియాల్లో ఆమె అశ్లీల వస్తువు, ఆడశిశువు వద్దంటూ భ్రూణహత్యలు,

కుటుంబం/సమాజంలో ద్వితీయ శ్రేణి పాత్ర, పురుషాధిక్య సమాజంలో నలుగుతున్న ప్రాణి, కొరవడిన ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక కట్టుబాట్లలో మగ్గుతున్న బక్క జీవి, ఉద్యోగ ఉపాధుల్లో వెనుకబాటు లాంటి పలు సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళ నేడు గోరంత అభివృద్ధిని సాధించినా ఇంకా కొండంత సాధించాల్సి ఉన్నది. ప్రపంచ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించిన పౌరసమాజం 1909 నుంచే "జాతీయ మహిళా దినం" పాటిస్తున్నప్పటికీ 1975 నుంచి ఐరాస నేతృత్వంలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవం(ఇంటర్నేషనల్ వూమెన్స్ డే)" నిర్వహించుట జరుగుతున్నది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026 ఇతివృత్తంగా "హక్కులు, న్యాయం, చర్యలు : బాలికలు, మహిళలు అందరికీ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. నిత్య జీవితంలో మహిళల పాత్రను గుర్తిస్తూ వారికి పురుషులతో సమానంగా అవకాశాలను కల్పించడం, ఉన్నత విద్యలో వారికి పెద్ద పీట వేయడం, ఆమె ఆరోగ్య పరిరక్షణకు ఊతం ఇవ్వడం, ప్రపంచాభివృద్ధిలో ఆమెను భాగం చేయడం, ఆమె మాటకు విలువ ఇవ్వడం, అన్ని రంగాల్లో ఆమె చేతికి నాయకత్వ పగ్గాలు అందించడం, ఉద్యోగ ఉపాధుల్లో చేయూత ఇవ్వడం, లింగవివక్షకు దూరంగా సమానత్వ బీజాలు నాటి పెంచి పోషించడం

నిరంతరం వేగంగా జరగాలి. ఆమెలో దాగిన అపార శక్తిని సుస్థిరాభివృద్ధికి వినియోగించాలి. 'గ్లోబల్ జెండర్ గ్యాప్-2025' నివేదిక ప్రకారం 148 దేశాల జాబితాలో భారత్ స్థానం 131 ఉండడం విచారకరం. భారత్‌లో 39 శాతం మహిళలు సెకండరీ విద్యను పూర్తి చేయడం, శ్రామిక లోకంలో 27.2 శాతం మహిళలు మాత్రమే ఉండడం బాధాకరం, ఆక్షేపణీయం. అమ్మ కారణంగా జన్మించిన మగాడు ఆమెను విస్మరిస్తే పుట్టగతులు ఉండవు. మహిళలో మహాలక్ష్మిని దర్శిస్తూ, స్త్రీలో ఐశ్వర్యాన్ని చూస్తూ, అమ్మతనానికి తలవంచి నమస్కరిద్దాం, ఆమెను పువ్వుల్లో పెట్టుకొని చూసుకుందాం. ఆమెలో సరస్వతి, లక్ష్మి, దుర్గలను దర్శిస్తూ సదా అతివకు అనంత అవకాశాలను అందిద్దాం. మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన కనీస కర్తవ్యం పురుష పుంగవుల మీదనే ఆధారపడి ఉందని గమనించి ఆ దిశగా వడివడిగా అడుగులు వేద్దాం, ఆమెకు సముచిత స్థానం కల్పిద్దాం.

# లైంగిక వేధింపులపై చట్టపర చర్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం వారి ప్రాథమిక హక్కులను హరించ డమే. ఆయా సందర్భాలలో మహి ళలు అన్యాయానికి, అసమానతలకు, గురవుతుండడం తరుచూ జరుగుతున్నదే. లింగసమానత్వం విషయంలో ఆశించిన స్థాయిలో సమాజంలో మార్పు రాకుండా ఉండడం చూస్తున్నదే. లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ పేరుతో జరిగే అనిష్టపూర్వక, ఆమోద యోగ్యం కాని లైంగిక ప్రవర్తనలు భారతదేశంలోనే కాక ప్రపంచమంతటా అడ్డుకట్ట వేయలేక పోతుండడం పాత విషయమే. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నేరాల్లో అత్యధిక భాగం పురుషులు వల్ల మహిళలు ఎదుర్కుంటున్న సమస్యలే. అయితే ఏ మహిళ గానీ, పురుషుడు గానీ తమ వ్యక్తిగత గౌరవానికి హోదాకూ భంగం కలిగించే అటువంటి ప్రవర్తననూ దానివల్ల వ్యక్తులకూ, సంస్థలకూ, సమాజానికి జరిగే హానికర ప్రభావాలనూ సహించ వలసిన అవసరం లేకుండా ప్రపంచ దేశాలు పకడ్బందీ చర్యలు గైకొంటున్నాయి. అలాంటి ప్రవర్తనా ధోరణిని అణిచివేయ వలసిన అవసరాన్ని గుర్తించి అనేక దేశాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులని నిషేధిస్తూ, వాటికి వ్యతిరేకంగా చట్టబద్ధమైన చర్యల్ని చేపట్టాయి. పని ప్రదేశాల్లో మహిళల పట్ల జరిగే లైంగిక వేధింపుల (నిరోధం, నివారణ, పరిహారాలు) చట్టం, 2013 ను ఆమోదించడం ద్వారా భారతదేశం కూడ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై చర్యలను బలోపేతం చేసింది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం, 2013 అనేది భారత దేశంలో మహిళలకు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నించి రక్షణ కలిగించటానికి ఏర్పడ్డ చట్టం. ఇది 2012 సెప్టెంబరు 3న లోక్ సభ ఆమోదం పొందింది. తర్వాత రాజ్య సభలో 2013 ఫిబ్రవరి 26న ఆమోదం పొందింది. ఈ బిల్లు చట్టం 2013 డిసెంబరు 9న అమలులోకి వచ్చింది. మహిళల మీద పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. పని ప్రదేశాల్లోని లైంగిక వేధింపులకు వ్యతిరేకమైన ఫిర్యాదులకు పరిహా రం అందేలా చూస్తుంది. మతం, జాతి, కులం, లింగ భేదం, లేదా ఇతరముల ఆధారంగా జీవన హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను అరికట్టడానికి వీలు లేదని రాజ్యాం గం స్పష్టం చేస్తున్నది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ 14, 15 ప్రకారం లైంగిక వేధింపు అనేది స్త్రీ ప్రాథమిక సమాన హక్కులను ఉల్లంఘిస్తుంది. అంతేకాక ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, హుందాగా జీవించే హక్కు, ఏ వృత్తి, ఉద్యోగం, వాణిజ్యం లేదా వ్యాపారం అయినా చేపట్టే హక్కుల లో నే లైంగిక వేధింపులు లేని వాతా వరణంలో పని చేసే హక్కు కూడా ఉంది. లైంగిక వేధింపులనేవి మహిళలకు సమాన అవకాశాలకూ సమానత్వ ప్రాతిపదికను పొందేందుకు అడ్డంకు అవుతాయదన్న కారణంగా భారత ప్రభుత్వం ప్రత్యేకించి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో నిబద్ధతను కన పరిచాయి. అలాగే మార్గదర్శ కాలను లేబర్ కమిషనర్లకు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలకు మార్గదర్శక సూత్రాలను రూపొందిం చడం జరిగింది. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల పట్ల జరిగే లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారాలు) చట్టం 2013, అమలులో భాగంగా, కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాల్లోనూ, జిల్లా స్థాయిల్లోనూ, ఉద్యోగుల, పనివారల, మహిళా సంస్థల్లోనూ ఉపయో గించేందుకు ఎప్పటికప్పుడు యీ చట్టం లోని మార్గదర్శక సూత్రాలను వర్తమాన పరిస్థితులకు అనుగుణం గా మెరుగుపర్చు కోవచ్చునని నిర్ణయించడం జరిగింది. ఒకే చోట పనిచేస్తున్న సమయంలో మగ, ఆడవాళ్ల, మధ్య స్నేహ పూర్వక బంధాలు ఏర్పడటం సర్వ సాధారణం. అయితే కొన్ని సందర్భా లలో వారి మధ్య సంభాషణలు, ప్రవర్తనలు శ్రుతి మించే అవకాశమూ ఉంటుంది. ఇద్దరికీ ఇబ్బంది లేనప్పుడు ఎలాంటి సమస్యా లేదు. పరస్పర అంగీకారం కొరవడి, మహిళ అభ్యంతరం చెప్పాక కూడా అవతలి వ్యక్తి అలానే వ్యవహరిస్తే అది లైంగిక వేధింపు కిందకే వస్తుంది. వేధించే వ్యక్తి ఆఫీసులో తమకంటే పై స్థాయిలో ఉన్నవాడైతే, వాళ్లపై ఫిర్యాదులు తమ ఉద్యోగాలకు ఎసరు పెట్టే ప్రమాదం ఉందని వారు భయపడుతున్నారు. అందుకే వారు ధైర్యంగా ఫిర్యాదు చేయలేకపోతున్నారు. ఒక్కో సందర్భం లో ఆ వ్యక్తి ఏదైనా చేస్తాడనే భయంతో కూడా మహిళ లు మౌనంగా ఉండిపోతున్నారు. చట్ట ప్రకారం పది మందికన్నా ఎక్కువ సిబ్బంది ఉన్న ప్రతి సంస్థా 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'ని ఏర్పాటు చేయాలి. దానికి ఒక సీనియర్ మహిళా ఉద్యోగి నాయ కత్వం వహించాలి. అందులో సగానికి పైగా మహిళా సభ్యులుండాలి. మహిళల కోసం పనిచేసే ఏదో ఒక ఎన్జీవో ప్రతినిధికి కూడా అందులో సభ్యత్వం ఉండాలి. పదిమందికంటే తక్కువ సిబ్బంది ఉన్న సంస్థల్లో ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే, జిల్లా స్థాయి ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలి.

# చివరి దశకు కగార్

**హైదరాబాద్, మార్చి 7, పెన్ పవర్:**
దేశంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ దాదాపు విజయవంతమైంది. ఇప్పటికే వందల మంది ఎన్‌కౌంటర్లలో మరణించారు. భారీగా లొంగుబాట పట్టారు. అగ్రనేతలు కూడా లొంగిపోతుండడంతో కిందిస్థాయి కేడర్ కూడా వారిని అనుసరిస్తోంది. ఇక తెలంగాణలో ఇప్పటికే అగ్రనేతలు లొంగిపోయారు. మిగిలిన ఒక్క అగ్రనేత కూడా అదేబాట పట్టనున్నారు. దీంతో మావోయిస్టుల శకం ముగియనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చల్లో రాష్ట్ర డీజీపీ సహా అధికారులు మావోయిస్టు పరిస్థితిని వివరించారు. దశాబ్దాల సాయుధ సంఘర్షణకు కట్టుమీసేందుకు రెండు ప్రభుత్వాలు సమన్వయం పెంచుకున్నాయి. మార్చి 31 నాటికి తెలంగాణను మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటించే లక్ష్యంతో పునరావాస పథకాలపై ఏకాభిప్రాయం ఏర్పడింది. వృద్ధాప్యం, అనారోగ్యాలతో బాధపడుతున్న మావోయిస్టు మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు (గణపతి) సమస్త్రవంతంలో చేరేందుకు సిద్ధత చూపుతున్నారు. తెలంగాణ ఇంటెలిజెన్స్ మధ్యవర్తిత్వంతో జరిగిన రహస్య చర్చలు తుది దశలో ఉన్నాయి. నేపాల్ నుంచి ఢిల్లీకి చేరినట్లు ప్రచారాలు ఆయన లొంగుబాటును దేశవ్యాప్త చర్చనీయాంశంగా మార్చాయి. ఉమ్మడి ఆపరేషన్లు, ఎన్‌కౌంటర్లతో ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, తిప్పిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డి వంటి నాయకులు కోల్పోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. దండకారణ్యంలోంచి కార్యకర్తలు జనజీవనంలోకి తిరిగి వస్తున్నారు. గణపతి ఏకైక మిగిలిన నాయకుడిగా మిగిలిపోవడంతో సంస్థాగత దెబ్బ ఎక్కువైంది. గణపతి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి ముగింపు గుర్తుగా నిలుస్తుంది, ఎందుకంటే 1970 నుంచి జగిత్యాల జైత్రయాత్ర, పీపుల్స్ వార్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు.

రాష్ట్రంలో అడవుల్లో ప్రశాంతత స్థిరపడి, అంతర్గత భద్రతా సవాళ్లు తగ్గుతాయి. పునరావాస ప్యాకేజీలు మిగిలిన క్యాడర్‌ను ప్రోత్సహిస్తాయి. తెలంగాణలో మావోయిజం అంతం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నక్సలిజం ముగింపు లక్ష్యాన్ని సాకారం చేస్తుంది. ఇది దక్షిణ మావోయిస్టు జోన్‌లో బలహీనతకు దారితీసి, దేశ భద్రతా వ్యవస్థకు ఆశాదాయక సంకేతం. భవిష్యత్ పోరాటాలకు పాఠాలుగా నిలుస్తుంది.

# ఏపీ లిక్కర్ స్కామ్

## 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు



**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది. మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది. సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలుపంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ఆారాదీజూ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది. కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది. కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది. కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది. ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి. ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# అంతా ఫీల్ గుడ్ కాదా..

**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ వివాదాలకు ఎట్టకేలకు తెరపడింది. కొలికపూడితో మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయి, పార్టీలో దీనిపై ఉన్న సీరియస్ నెస్, రాజకీయంగా కలిగే నష్టాలను చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం ఈ వివాదాలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పందించారు. తిరువూరులో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్టకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే తాను చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అధికార ప్రోటోకాల్, పరస్పర గౌరవం గురించి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని, అదే సమయంలో ఆయన నుంచి కూడా తాను అదే గౌరవాన్ని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన ప్రాణాలకు ముప్పు ఉందని గురువారం ఆరోపించారు. నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన ఘటనను ఉటంకిస్తూ, తనపై దాడి చేసి చంపేందుకు పక్కా ప్రణాళిక జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచే మధ్యాహ్నం నుండి జనాన్ని సమీకరించాలని ఆదేశాలు వెళ్లాయని, తనను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నారని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం స్పందించింది. ఇది వ్యక్తిగతంగానే కాదు, పార్టీకి నష్టం కలిగిస్తుందని.. విభేదాలు మంచిది కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిఘా వర్గాల ద్వారా తన గన్ మెన్‌కు ముందస్తు హెచ్చరికలు అందినప్పటికీ, తనకు కనీసం ఒక అదనపు కానిస్టేబుల్‌ను కూడా భద్రతగా కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణం సమయంలో కరెంట్ తీసివేసి చీకట్లో తనపై దాడి చేయాలని ప్లాన్ చేశారని, అయితే పోలీసులు అందుకు నిరాకరించడం వల్ల ప్రమాదం తప్పిందని తనకు సమాచారం ఉందని ఆయన వెల్లడించారు. తన కారు అద్దాలు పగలగొట్టి, టైర్ల గాలి తీసి తనను అడ్డుకుని భౌతిక దాడి చేయాలని చూశారనే స్పష్టమైన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కొలికపూడి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా తనకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

# పెళ్లిళ్లు..ఓదార్పులేనా....

**కడప, మార్చి 7, పెన్ పవర్:**
గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెళ్లి బాధితుల్ని పరామర్శించేవారు. కానీ ఇప్పుడు ఆయన రూట్ మారిపోయింది. ఘోర విషాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఓదార్చడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. పార్టీ నేతలు అరెస్టు అయితే యాత్రగాతో వెళ్లి పరామర్శలు చేస్తున్నారు. అదికూడా కొంత మంది కే. మిగిలిన వారిని ఇంటికి పిలిపిచుకుని ఓదారుస్తున్నారు. ఇక ప్రజాసమస్యలు.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే మాత్ర అసలు వెళ్లడం లేదు. ఈ నెలలో రెండు, మూడు ఘోర విషాదాలు ఏపీలో జరిగాయి. ఒకటి కల్తీ పాల విషాదం, రెండు బాణసంచా విషాదం. ఉత్తరాధ్రలో డయోరియా వల్ల కూడా కొంతమంది చనిపోయారు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడుప్రతిపక్ష పార్టీలు హడావుడి చేస్తాయి. కానీ జగన్మోహన్ రెడ్డి అసలు పట్టించుకోలేదు జగన్ పరామర్సలు చేస్తారని వైసీపీ వర్గాలు అనుకున్నా.. ఈ వారం ఆయన పెళ్లిళ్లకు మాత్రమే పరిమితమయ్యారు. గత రెండేళ్లుగా జగన్ చేస్తున్నది ఇదే. వైసీపీ ఓడిపోయిన తర్వాత జగన్ రాజకీయం పూర్తిగా విజిటింగ్ ప్రొఫెసర్ తరహాలో జరుగుతోంది. వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే తాడేపల్లిలో ఉంటున్నారు. బుధవారం వచ్చి శుక్రవారం బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఓ ప్రెస్మీట్ లేకపోతే పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా మాట్లాడి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువ. ఓ సారి చిత్తూరులో మామిడి రైతులకు సంఘిభావం తెలిపేందుకు
వెళ్లారు. ఆ తర్వాత పార్టీ నేతల ఇళ్లకు పరామర్శలకే వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి తన పర్యటనలను ఎక్కువగా రాజకీయ కారణాలకే పరిమితం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారన్న భావనలో జగన్ ఉన్నారని .. ఆ అసంతృప్తి ఆయనలో ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే జగన్ స్వయంగా తనకు నలభై శాతం ఓటు బ్యాంక్ ఉందని చెబుతూ ఉంటారు. ఆ కోణంలోనే ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా, ఆయన కేవలం ప్రెస్ నోట్లు, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం పార్టీ క్యాడర్ ను అసంతృప్తికి గురి చేస్తోంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం మరో విధంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై కేసులు బనాయిస్తోందని, వారిని కాపాడుకోవడమే ప్రస్తుతానికి ప్రాధాన్యత అని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో గెలిచిన దగ్గర నుండే జగన్ జనంతో నేరుగా మమేకం అవ్వడం తగ్గించారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నాయి. ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా
అదే ధోరణి కొనసాగించడం రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఒకప్పుడు ఓదార్పు యాత్ర పేరుతో ఊరూరా తిరిగిన జగన్, ఇప్పుడు అదే ప్రజలు కష్టాల్లో ఉంటే వెళ్లడానికి వెనకాడుతుండటం ఆయన ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అయితే జగన్ మూడేళ్ల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకూడదని..చివరి రెండేళ్లు పాదయాత్ర చేస్తారు కాబట్టి అంతా కవర్ అయిపోతుదంని పార్టీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు ఆయన మూడేళ్లు ఏం చేశారన్నది మర్చిపోతారని. చివరి రెండేళ్ల పోరాటంతోనే ఓట్లేస్తారని అంటున్నారు.

## విజయవాడ విద్యాధరాపురం లో దారుణం

### మూడు సంవత్సరాల పాప పై యాసిడ్ పోసిన స్కూల్ టీచర్

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**విజయవాడ: పెన్ పవర్:** విజయవాడ విద్యాదారపురం నేషనల్ ప్లే స్కూల్ లో టీచర్ చేసిన నిర్వాకం ఆలస్యంగా బయటపడింది. ఫిబ్రవరి 23 వ తారీకు పాపను నేషనల్ స్కూల్ దగ్గరపాపను తల్లీ దింపింది. కాసేపటికి స్కూల్ నుంచి పాప బాతురూమ్ లో పడిపోయింది అని తల్లి కి ఫోన్ వచ్చింది. వెంటనే పాప తల్లీ, అక్క స్కూల్ కి వచ్చి ఏడుస్తూ ఉన్న పాపని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . పాపను హాస్పిటల్ కు తీసుకువెళ్తే నిజాలు బయటపడ్డాయి. తల్లిదండ్రులు స్కూల్ దగ్గర కు వెళ్లి స్కూల్ యజమానాన్ని గట్టిగా అడుగగా నిజం స్కూల్ యాజమాన్యం ఒప్పుకుంది. హాస్పిటల్ లో బిల్లు కట్టి చేతులు దులుకుకుంది. తరువాత కొంత డబ్బులు ఇచ్చి రాజీకి రమ్మని స్కూల్ యాజమాన్యం చెప్పింది. తల్లిదండ్రులు ఒప్పుకోవకపోవడం తో బెదిరింపులకు దిగింది. ఈ విషయాలు బయటకు చెప్తే మీ అంతుచస్తాను అంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చారు. డీసీపీ తమ చుట్టం అంటూ తల్లిదండ్రులకు బెదిరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కూతురిపై ఇంత కూరాత్మకంగా గాయపరిచిన వారిని శిక్షించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## గ్యాస్ ధరల పెంపు

**న్యూఢిల్లీ: పెన్ పవర్:** అమెరికా ఇరాన్ యుద్ధం ప్రభావం మన దేశంపై ప్రభావం గట్టిగానే పడుతోంది. అంతర్జాతీయంగా ముడిచమురు రవాణాకు ఆటంకం ఏర్పాడిన నేపథ్యంలో దేశంలో చమురు ధరల పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తక్షణం కొత్త రెట్లు అమలులోకి రానున్నాయి. కమర్షియల్ సిలిండర్ ధర రూ.115, వంట గ్యాస్ ధర రూ.60 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. హైదరాబాద్ లో వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు తర్వాత రూ.965 గా ఉంటుంది. ఉజ్వల స్కీమ్ సిలిండర్ ధర విషయంలో ఎలాంటి మార్పు ఉండదని కేంద్రం తెలిపింది. పెట్రోల్ డీజిల్ ఇతర గ్యాస్ ధరలు కూడా పెరిగే అవకాశముంది.. దేశంలో చమురు నిల్వలు ఇరవై రోజుల్లో అడుగంటే పరిస్థితి ఉందని సమాచారం.

## కమలం చేతికి బీహార్..

**పాట్నా, మార్చి 7, పెన్ పవర్:** బిహార్‌లో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకరారం చేసి 21 ఏళ్లుగా బిహార్‌కు దశ దిశ నిర్దేశించిన నితీశ్‌కుమార్ రాజకీయం రాష్ట్రంలో ముగిసింది. రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మార్చి 5న నామినేషన్ వేశారు. నితీశ్‌కుమార్ ఢిల్లీ రాజకీయాలకు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఆయన పూర్తికాలం ఉంటారని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ 5వ తేదీన నితీశ్‌కుమార్ ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టారు. రాజ్యసభకు నామినేసన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 4న వన్ ఆన్ మాల్ భవనంలో జరిగిన కీలక సమావేశం నితీశ్ నిర్ణయానికి మూలం. కేంద్ర మంత్రులు సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, విజయ్ కుమార్ చౌహాన్, బిజేంద్ర యాదవ్ పాల్గొన్నారు; అమిత్ షా ఫోన్‌లో చేరి ఆరోగ్యం, పరిపాలనా సవాళ్లపై చర్చించారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మార్పు, మతి సమస్యల ప్రచారం, ఐఏఎస్ అధికారుల ప్రభావం ప్రజల్లో అసంతృప్తి తెచ్చాయి. మార్చి 5న ఎక్స్ పోస్ట్‌లో రాజ్యసభ ప్రయాణాన్ని ప్రకటించారు. నితీశ్ కుమారుడు 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్ కుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసి పార్టీ ఐక్యత కాపాడాలని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ అనుభవం లేనప్పటికీ, తండ్రి వెంట తిరుగుతూ క్రమంగా ప్రజాధరణ సంపాదించాలని ప్రణాళిక. కుటుంబ పాలనకు వ్యతిరేకత ఉన్నా, పార్టీ స్థిరత్వం కోసం ఈ దీర్ఘకాల ప్రణాళిక రూపొందుతోంది. జేడీయూ శ్రేణులు నిశాంత్ ప్రజాధరణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇక బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం రాబోతోంది. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి (నితీశ్ సమాజిక వర్గనేత), నిత్యానంద రాయ్ యాదవ్, దిలీప్ సైస్వాల్, విజయ్ కుమార్ సిన్హా సీఎం అవకాశాల్లో ముందున్నారు. బీజేపీ ఆధారంతో జేడీయూ మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు దారితీస్తుంది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఇది నితీశ్ స్వచ్ఛంద నిర్ణయమని, భవిష్యత్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. రాజ్యసభ స్థానం జేడీయూ ప్రభావాన్ని కొనసాగిస్తుందని ఆశ. అసెంబ్లీలో 249 స్థానాల్లో బీజేపీ 89, జేడీయూ 86, రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ 19, ఆర్ఎల్‌జేపీ 4 సాధించాయి. ఆర్ఎల్‌జేపీ బీజేపీలో విలీనం ప్రణాళిక ఆర్‌జేడీ చీల్చే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఈ మలుపుతో బీజేపీ మరో రాష్ట్రంలో సీఎం పదవి సాధించనుంది. రోహిణి ఆచార్యలు నితీశ్‌ను బీజేపీ 'కీలుబొమ్మ'గా విమర్శిస్తూ, మిత్రద్రోహానికి మూల్యం చెల్లించారని ఆరోపించారు. ఈ పరిణామం బీజేపీ బలోపేతానికి జేడీయూ బలహీనతకు దారితీస్తోంది.

## 14 దేశాలకు పాకిన యుద్ధం

**న్యూయార్క్, మార్చి 7, పెన్ పవర్:** మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులతో యుద్ధమ మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టుబెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది. చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యాఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికాఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది. తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాష్ట్ర సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

## భారత్ కు అండగా రష్యా

**న్యూఢిల్లీ, మార్చి 7, పెన్ పవర్:** ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ కారణంగా ఇంధన సరఫరాకు ఆటకం ఏర్పడింది. ఇరాన్ ఆర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వందలాది నౌకలు నిలిచిపోయాయి. మరోవైపు ఇరాన్ దాడితో గల్ఫ్ దేశాల్లో ఆయిల్ ఉత్పత్తి, సరఫరాకు అంతకాయం కలిగింది. దీంతో ప్రపంచంలో అతిపెద్ద ఆయిల్ దిగుమతిదారులు అయిన చైనా, భారత్‌తోపాటు యుపోపియన్ యూనియన్‌పై ప్రభావం పడనుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగాయి. ఈ ప్రభావం భారత్, చైనాపై ఎక్కువగా ఉండనుంది. దీంతో ఈ రెండు దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నాయి. భారత్ తన ఇంధన అవసాల్లో 85 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ఇందులో 60 శాతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఆర్మూజ్ జలసంధి మూసివేసిన నేపథ్యంలో ఈ 60 శాతం దిగుమతి నిలిచిపోయింది. ప్రస్తుతం దేశంలో 20 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ దిగుతులపై భారత్ గల్ఫ్ దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. మరోవైపు రష్యాతో చర్చలు జరుపుతోందియుద్ధం కారణంగా ఏర్పడిన ఆయిల్ కొరతను తీర్చేందుకు రష్యా ముందుకు వచ్చింది. అతిపెద్ద చమురు దిగుమతిదారులు అయిన భారత్, చైనాకు అవసరమైన ఆయిల్ సరఫరాకు సిద్ధమని తెలిపింది. లోటు చమురును తామే పూడుస్తామని వెల్లడించింది. అమెరికా ఒత్తిడితో ఇటీవలే భారత్ రష్యా ఆయిల్ దిగుమతి తగ్గించింది. కానీ ప్రస్తుత యుద్ధ పరిస్థితులతో అమెరికా ఒత్తిడిని పక్కన పెట్టింది. దేశ అవరసాలకే ప్రాధాన్యం ఇచ్చింది. రష్యా ఆయిల్ దిగుమతులు పెంచేందుకు సిద్ధమైంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్ సైన్యం తుడిచిపెట్టుకుపోయింది..

## డొనాల్డ్ ట్రంప్ కీలక స్టేట్‌మెంట్



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా నిర్వీర్యం చేశామని ప్రకటించారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం ఇరాన్ తన రక్షణ వ్యవస్థలను కోల్పోయిందని పేర్కొన్నారు. ఇరాన్ సైన్యం అంతమైపోయిందని.. వారి నౌకాదళం (ఔజీలఎ) కనుమరుగైందని, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఇరాన్ నాయకులు ఒకరి తర్వాత ఒకరు తుడిచిపెట్టుకుపోతున్నారని అన్నారు. ఇప్పటికే రెండు స్థాయిల నాయకత్వం అంతమైందని, ఇప్పుడు వారు మూడో స్థాయి నాయకత్వంతో నెట్టుకొస్తున్నారని క్లారిటీ ఇచ్చారు. ఇరాన్ వద్ద ఉన్న 32 నౌకలు ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని.. అసలు ఆ దేశానికి నౌకాదళం అనేదే ఇప్పుడు లేదన్నారు. ఇక వైమానిక దళం (ంతితీ ఈనీతీఇవ) విషయానికి వస్తే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని వారికి ఇప్పుడు గగనతల రక్షణే లేదని డొనాల్డ్ ట్రంప్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.

## ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సాయం!

పశ్చిమాసియాలో యుద్ధ సమీకరణాలు మారిపోతున్నాయి. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక మద్దతు ఇస్తోందని తాజాగా ఓ నివేదిక పేర్కొంది. అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'రియల్ టైమ్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోందని తెలిపింది. యుద్ధం తీవ్రమవుతున్న వేళ, అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకునేందుకు ఇది దోహదపడుతోంది. ఓ ప్రముఖ అమెరికన్ పత్రిక కథనం ప్రకారం.. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా యుద్ధనౌకలు, విమానాలు, ఇతర సైనిక స్థావరాల సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేసిందని ముగ్గురు అధికారులు వెల్లడించారు. యుద్ధం ప్రారంభంలోనే ఇరాన్.. అమెరికా దళాలను కనిపెట్టే శక్తిని చాలావరకు కోల్పోయింది. అయినా అగ్రరాజ్య సైనిక లక్ష్యాలపై దాడులు చేయగలుగుతోంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరాన్ వేల సంఖ్యలో వన్-వే ఎటాక్ డ్రోన్లను, వందల క్షిపణులను అమెరికా సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలు, ఇతర లక్ష్యాలపై ప్రయోగించింది. అమెరికా కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలనూ దెబ్బతీస్తోంది.

## అమెరికా తీరుపై గల్ఫ్ దేశాల్లో అసంతృప్తి!

ఇరాన్‌పై దాడి విషయంలో ఇజ్రాయెల్-అమెరికాలు వ్యవహరిస్తున్న తీరుపై కొన్ని గల్ఫ్ దేశాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. తమను ముందే అప్రమత్తం చేయకుండా ఇజ్రాయెల్- అమెరికాలు గతనెల 28న ఇరాన్‌పై సంయుక్త దాడిని ప్రారంభించాయని ఆయా దేశాలు ఆరోపిస్తున్నాయి. దాడుల్ని ఆకస్మికంగా ప్రారంభించిన కారణంగా ఇరాన్ వెల్లువలా చేసిన ప్రతీకార దాడుల్ని నిలువరించేందుకు ముందస్తుగా సిద్ధమయ్యే అవకాశం తమకు లేకుండా పోయిందని అమెరికా మిత్రదేశాలైన ఆ దేశాలు పేర్కొంటున్నాయి. ఇరాన్‌పై జరిపే దాడి మొత్తం పశ్చిమాసియాలో విధ్వంసానికి కారణమవుతుందని తాము చేసిన హెచ్చరికల్ని అమెరికా బేఖాతరు చేసిందని ఆరోపిస్తున్నాయి. అమెరికా సైన్యం తమకు తగినంత భద్రత కల్పించలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ గల్ఫ్ దేశాల ప్రతినిధులు పేర్కొన్నారు. సొంత దళాలను రక్షించుకోవడంపైనే అమెరికా, ఇజ్రాయెల్ దృష్టి కేంద్రీకరించాయని, గల్ఫ్ దేశాలను గాలికి వదిలేశాయని పశ్చిమాసియా ప్రజలు నమ్ముతున్నారని ఆ ప్రతినిధి తెలిపారు. ఇరాన్ క్షిపణి దాడుల్ని అడ్డుకోవడానికి తాము సమకూర్చుకున్న ఇంటర్‌సెప్టర్ల సంఖ్య క్రమంగా తరిగిపోతోందని వాపోయారు. ఈ అంశంపై బహిరంగంగా వ్యాఖ్యానించడానికి బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల ప్రతినిధులు అంగీకరించలేదు. ఇరాన్ దాడులపై గల్ఫ్ దేశాలు బహిరంగ ప్రకటనలేవీ చేయడం లేదు. అయితే ఆయా దేశాల ప్రముఖులు మాత్రం అమెరికా తీరును విమర్శిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుణ్ని అనవసరమైన యుద్ధంలోకి లాగారని బాహాటంగా చెబుతున్నారు.

## రష్యా చమురును

## నెల రోజులు దిగుమతి చేసుకోవచ్చు

న్యూఢిల్లీ : రష్యా నుంచి 30 రోజుల పాటు చమురు దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా 'అనుమతించింది'. ఈ వెసులుబాటుతో ఇంధన ధరల పెరుగుదలకు కళ్లెం వేయవచ్చునని, మధ్యప్రాచ్యంలో యుద్ధం నేపథ్యంలో దిగుమతులలో జరుగుతున్న జాప్యం కారణంగా సరఫరాలలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించవచ్చునని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల వల్ల ఎదురవుతున్న ఒత్తిడులను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ తెలిపారు. కాగా దేశంలో ముడి చమురు, పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినన్ని ఉన్నాయని భారత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వ వర్గాల ప్రకారం భారత్ వద్ద ఇరవై ఐదు రోజులకు సరిపడా ముడి చమురు, ఇరవై ఐదు రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయి. భారత్ ఇటీవల కాలంలో రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకొని, అమెరికా నుంచి సరఫరాలను పెంచుకుంటున్న విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలును తగ్గించుకుని అమెరికా, గల్ఫ్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నందున దేశంపై ఆర్థిక భారం పెరుగుతోంది. కాగా ట్రంప్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న 'ఉదారత'పై కాంగ్రెస్ మండిపడింది. భారత్ ఎవరి వద్ద చమురు కొనుగోలు చేయాలో, ఎవరి వద్ద కొనుగోలు చేయకూడదో అమెరికా నిర్దేశిస్తోందని ఆరోపించింది.

## ఎల్‌పీజీ గ్యాస్ కొరత!

న్యూఢిల్లీ : అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఆందోళనలతో గ్యాస్, చమురు సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది. ప్రస్తుతం దేశంలో కేవలం 30 రోజులకు సరిపడ గ్యాస్ నిల్వలు మాత్రమే ఉండటంతో కేంద్ర ప్రభుత్వంలో గుబులు మొదలయ్యింది. ఈ క్రమంలోనే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను కేంద్రం ఆదేశించింది. గ్యాస్ తయారీకి వాడే ప్రొపేన్, బ్యూటేన్‌లను పెట్రో కెమికల్ రంగానికి మళ్లించకుండా కేవలం వంటగ్యాస్ కోసమే వాడాలని స్పష్టం చేసింది. ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లకు మాత్రమే విక్రయించాలని.. తద్వారా దేశీయ వినియోగదారులకు నిరంతర సరఫరా జరిగేలా చూడాలని సూచించింది. భారత్ ఎల్‌పీజీ అవసరాల కోసం 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ అనిశ్చితి వల్ల సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 32 కోట్ల మంది ఎల్‌పీజీ వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనుందని ఇటీవల పలు రిపోర్టులు వచ్చిన విషయం తెలిసిందే.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్‌అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్మూజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

# యుద్ధం 2 వారాలు కొనసాగితే బ్యారెల్ చమురు 150 డాలర్లకు..

పశ్చిమాసియాలో జరుగుతున్న ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికాల మధ్య యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో వందలాది ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడకక్కడ నిలిచిపోయాయి. అలాగే, గల్ఫ్ దేశాలపై దాడులతో ఆయిల్ ఉత్పత్తి ఆగిపోయింది. ఈ పరిణామాలు అందర్నీ కలవరానికి గురిచేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఖతార్ చేసిన ప్రకటన.. మరింత ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మరో రెండు వారాల పాటు కొనసాగితే ప్రపంచ చమురు ధరలు భారీగా పెరిగి బ్యారెల్ 150 డాలర్ల వరకు చేరుతుందని ఖతార్ ఇంధన మంత్రి సాద్ అల్-కాబీ ఫైనాన్షియల్ టైమ్స్‌తో అన్నారు. అలాంటి పరిస్థితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు. దీర్ఘకాలిక యుద్ధం కారణంగా గల్ఫ్ ఇంధన ఎగుమతిదారులు ఉత్పత్తిని నిలిపివేయాల్సి వస్తుందని అల్-కాబీ అన్నారు. ప్రపంచానికి పెను సంక్షోభం పొంచి ఉందని హెచ్చరికలు చేశారు. ఘర్షణ తక్షణమే ఆగిపోయినప్పటికీ, తమ దేశంలోని అతిపెద్ద చమురు రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి తర్వాత సాధారణ పరిస్థితికి చేరుకోడానికి ఖతార్‌కు వారాల నుంచి నెలల వరకు పట్టొచ్చని ఆయన అన్నారు. లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ)ను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం ఖతార్. ప్రపంచ సరఫరాలో 20 శాతం వాటా కలిగిన ఖతార్... ఆసియా, ఐరోపా మార్కెట్లలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే వారం రోజుల్లోనే చమురు ధరలు 15 శాతం మేర పెరిగి.. బ్యారెల్ 87 డాలర్లకు చేరుకుంది. ఇక, హార్మూజ్ జలసంధి నుంచి ఇజ్రాయెల్, అమెరికా, ఐరోపా, దాని మద్దతుదారుల

నౌకలను అనుమతించేది లేదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో భారత వంటి తటస్థ దేశాలకు కొంత ఊరట నిచ్చింది. చైనా జెండా ఉన్న నౌకలను మంగళవారం రాత్రి నుంచి ఇరాన్ అనుమతిస్తుంది. ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌కు మద్దతుగా యూకే నాలుగు యుద్ధ విమానాలను పంపుతున్నట్టు ఆ దేశ ప్రధాన మంత్రి కైర్ స్టార్మర్ ఆ దేశ రాజుకు హామీ ఇచ్చారు.

# కేరళలోని ఇడుక్కి మరియన్ కాలేజీలో రాహుల్ గాంధీ సందడి



కేరళ: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేరళ పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఇడుక్కి జిల్లాలోని మరియన్ కాలేజీ విద్యార్థులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా కేరళ అత్యంత ప్రాచీన యుద్ధ విద్య అయిన 'కలరిపయట్టు' విన్యాసాలను విద్యార్థులతో కలిసి ప్రయత్నించి అందరినీ ఆకట్టుకున్నారు. కాలేజీ విద్యార్థులతో రాహుల్ ముచ్చటిస్తుండగా, కలరి విద్యను ప్రయత్నించమని ఒక విద్యార్థి కోరారు. దీనికి రాహుల్ వెంటనే అంగీకరించి, విద్యార్థులతో కలిసి కొన్ని ప్రాథమిక కలరి కదలికలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ కలరిపయట్టు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మార్షల్ ఆర్ట్ అని, ఇది అన్ని యుద్ధ విద్యలకు 'తల్లి' వంటిదని అభివర్ణించారు. కేరళ సంప్రదాయాల్లో అపారమైన బలం, క్రమశిక్షణ, గ్రేస్ ఉన్నాయని ఆయన కొనియాడారు. కలరి అనేది శారీరక దృఢత్వం, ఫ్లెక్సిబిలిటీ, ఆత్మరక్షణల సమాహారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు, మహాత్మా గాంధీ, శ్రీనారాయణ గురు సమావేశమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన శతాబ్ది ఉత్సవాల్లో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు ఆందోళనకర దిశలో సాగుతున్నాయని విమర్శించారు

# వంట గ్యాస్ ఉత్పత్తి పెంచండి

న్యూఢిల్లీ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధానికి తెగబడటంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో గ్యాస్, చమురు సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది. ప్రస్తుతం దేశంలో కేవలం 30 రోజులకు సరిపడా గ్యాస్ నిల్వలు మాత్రమే ఉన్నాయి. దేశంలో ఎల్‌పిజి ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను కేంద్రం ఆదేశించింది. గ్యాస్ తయారీకి వాడే ప్రొపేన్, బ్యూటేన్‌లను పెట్రో కెమికల్ రంగానికి మళ్లించకుండా వంటగ్యాస్ కోసమే వాడాలని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ చమురు శుద్ధి సంస్థలకు స్పష్టం చేసింది. ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను ప్రభుత్వరంగ సంస్థలైన ఐఒసి, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లకు మాత్రమే విక్రయించాలని, తద్వారా దేశీయ వినియోగదారులకు నిరంతర సరఫరా జరిగేలా చూడాలని సూచించింది. భారత్ ఎల్‌పిజి అవసరాల కోసం 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ అనిశ్చితి వల్ల సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ఈ ముందస్తు చర్యలు



చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎల్‌పిజి గ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 32 కోట్ల మంది ఎల్‌పిజి వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనుందని ఇటీవల పలు రిపోర్టులు వచ్చిన విషయం తెలిసిందే. అమెరికా ఆంక్షలతో రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోళ్లు దాదాపుగా నిలిచిపోయాయి. అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలవంచడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు తాజాగా అమెరికా అనుమతిం చడంతో కొంత ఉపశమనం కలిగే అవకాశముందని సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



చిన్నపిల్లల్లో పెరుగుతున్న సోషల్ మీడియా వ్యసనం, సైబర్ బుల్లింగ్ మరియు మానసిక ఆరోగ్య సమస్యలను అరికట్టేందుకు ఇండోనేషియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించకుండా పరిమితులు విధిస్తున్నట్లు ఆ దేశ సమాచార, డిజిటల్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. మార్చి 28 నుండి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మరియు రోబ్లాక్స్ వంటి "అధిక రిస్క్" కలిగిన యాప్‌లలో 16 ఏళ్ల లోపు పిల్లల ఖాతాలను క్రమంగా నిలిపివేయనున్నారు. అశ్లీలత, సైబర్ బుల్లింగ్, ఆన్‌లైన్ మోసాలు మరియు ప్రధానంగా సోషల్ మీడియా వ్యసనం నుండి పిల్లలను రక్షించడమే లక్ష్యమని ఆ దేశ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. "ప్రారంభంలో ఇది కొంత అసౌకర్యాన్ని కలిగించవచ్చు. పిల్లలు ఫిర్యాదు చేయవచ్చు, తల్లిదండ్రులు అయోమయానికి గురికావచ్చు. కానీ మన పిల్లల భవిష్యత్తు కోసం ఇది అవసరం," అని ఇండోనేషియా మంత్రి మెయుత్యా హఫీద్ పేర్కొన్నారు. పాశ్చాత్యేతర దేశాల్లో ఇటువంటి కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్న మొదటి దేశం ఇండోనేషియా కావడం విశేషం. 28 కోట్ల జనాభా ఉన్న ఇండోనేషియాలో ఇంటర్నెట్ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2024 సర్వే ప్రకారం దేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి 79.5%కి చేరుకుంది. 12 ఏళ్ల లోపు పిల్లలలో 48% మందికి ఇంటర్నెట్ సదుపాయం ఉంది. వీరిలో అత్యధికులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మరియు టిక్‌టాక్ వాడుతున్నట్లు గుర్తించారు. ఈ కొత్త నిబంధనల అమలుకు సంబంధించి ప్లాట్‌ఫారమ్‌లు పాటించాల్సిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. మెటా (ఓవబిజీ), టిక్‌టాక్ మరియు రోబ్లాక్స్ సంస్థలు దీనిపై ఇంకా స్పందించలేదు.

# పోర్టుల నుండి కంటైనర్లు వెనక్కి..

అమెరికా, ఇజ్రాయిల్ నిరంకుశ చర్యలతో ఇరాన్‌పై ఏకపక్ష దాడులు పెరుగుతోన్న నేపథ్యంలో సముద్ర మార్గాలు మూసుకు పోవడంతో భారత ఎగుమతి రంగం తీవ్ర సంక్షోభం లోకి జారుకుంటుంది. దేశీయ ఓడరేవుల్లో సుమారు 38,000 కంటైనర్లు నిలిచిపోగా, అటు సరుకు పంపలేక, ఇటు పోర్టుల్లో పెరుగుతున్న భారీ అద్దెలు, షిప్పింగ్ సర్‌ఛార్జీలను భరించలేక ఎగుమతిదారులు దాదాపు 19,000 కంటైనర్లను బ్యాక్ టు టౌన్ దరఖాస్తుల ద్వారా వెనక్కి రప్పించుకుంటున్నారు. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, బాస్మతీ బియ్యం వంటి త్వరగా పాడైపోయే వస్తువులను దేశీయ మార్కెట్లలోనే విక్రయించేందుకు సిద్ధమవుతుండటంతో స్థానికంగా వీటి ధరలు తగ్గే అవకాశం ఉండటంతో ప్యాకేజింగ్, రవాణా ఖర్చుల రూపంలో వ్యాపారులు భారీ నష్టాలను చవి చూస్తున్నారు.

# ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఉద్రిక్తతలపై మూడీస్ హెచ్చరిక




ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌ల దురహంకార యుద్ధంతో భారత్‌లో ద్రవ్యోల్బణం ఎగిసిపడనుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా ఇంధన ధరల పెరుగుదల వల్ల రూపాయి విలువ క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం, కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) పెరగడం వంటి సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. భారత్ తన ముడి చమురు, సహజ వాయువు అవసరాల కోసం సుమారు 46 శాతం మధ్యప్రాచ్య దేశాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో సరఫరాకు అంతరాయం కలిగితే అది దేశీయ ఆర్థిక నిర్వహణను క్లిష్టతరం చేస్తుందని మూడీస్ విశ్లేషించింది. ఒకవేళ ఈ అనిశ్చితి మరికొన్ని వారాల పాటు కొనసాగితే, బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటే అవకాశం ఉందని, దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతుందని మూడీస్ హెచ్చరించింది. యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే ప్రభుత్వ రాయితీలు పెరిగి బడ్జెట్ అంచనాలు తలకిందులయ్యే ప్రమాదం ఉందని మూడీస్ అంచనా వేసింది.

# అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి అని ఆయన శుక్రవారం ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన 'ఖొర్రమ్‌షహర్-4' బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నిమ్ వార్తా సంస్థ వెల్లడించింది.ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవెల్యూషన్ గార్డ్ కోర్ తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించిందిమరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు.మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం అని ఆయన వ్యాఖ్యానించారు.

# బంగారంపై భారీ డిస్కౌంట్లు..!

బంగారానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతటి డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచంలో ఎక్కడ చూసినా బంగారంపై ప్రజలకు అపారమైన ఆసక్తి, పెట్టుబడిగా పెట్టాలనే నమ్మకం ఉంటుంది. అందుకే బంగారాన్ని ఎప్పటికీ విలువ తగ్గని ఆస్తిగా భావిస్తారు.అయితే ప్రస్తుతం జరుగుతున్న కొన్ని అనూహ్య పరిణామాలు బంగారం మార్కెట్‌లో అసాధారణ పరిస్థితులను సృష్టించాయి. ముఖ్యంగా మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, బంగారం వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన ఆబీఎజీతిలో అనూహ్య మార్పులకు దారితీశాయి.సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరుగుతూ ఉండగా, దుబాయ్‌లో మాత్రం బంగారంపై భారీ డిస్కౌంట్లు కనిపిస్తున్నాయి. యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోవడం, రవాణా వ్యవస్థ అంతరాయం కలగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. తమ వద్ద నిల్వగా ఉన్న బంగారాన్ని ఎక్కువకాలం భద్రపరచడం ఖర్చుతో కూడుకున్నదిగా మారడంతో వ్యాపారులు తక్కువ ధరకే విక్రయించడానికి ముందుకు వస్తున్నారు. లండన్ మార్కెట్ ధరతో పోలిస్తే ఔన్సుపై సుమారు 30 డాలర్ల వరకు తగ్గింపుతో అమ్ముతున్నట్లు సమాచారం.ఎగుమతులు నిలిచిపోవడానికి కారణాలు.దుబాయ్ అనేది ఆసియా, ఆఫ్రికా దేశాలకు బంగారాన్ని శుద్ధి చేసి పంపించే ప్రధాన కేంద్రాల్లో ఒకటి. ప్రస్తుతం అక్కడ కొన్ని విమాన సర్వీసులను పాక్షికంగా నిలిపివేశారు. దీంతో బులియన్ ఎగుమతులు దాదాపు ఆగిపోయాయి.సాధారణంగా బంగారం రవాణాకు



ప్రయాణికుల విమానాలనే ఎక్కువగా ఉపయోగిస్తారు. కానీ అవి అందుబాటులో లేకపోవడంతో సరుకు తరలింపులో అంతరాయం ఏర్పడింది.యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రవాణా ఖర్చులు దాదాపు 60 నుంచి 70 శాతం వరకు పెరిగినట్లు చెబుతున్నారు.ఇక భారత్ విషయానికి వస్తే, దేశానికి అవసరమైన బంగారంలో పెద్ద భాగం దుబాయ్ నుంచే దిగుమతి అవుతుంది. ప్రస్తుతం రవాణా అంతరాయం కారణంగా భారత్‌లో బంగారం సరఫరా కొంత తగ్గినట్లు కనిపిస్తోంది.

# ఒరాకిల్ సంస్థలో భారీ లేఆఫ్స్.. ఏకంగా 30,000 మంది ఉద్యోగులపై వేటు?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక సంస్థలు తమ కంపెనీలలో ఉద్యోగులపై వేటు వేస్తున్న సంగతి తెలిసిందే. కానీ ప్రముఖ టెక్ దిగ్గజం ఒరాకిల్ ఏఐ కోసం చేసుకున్న ఒప్పందం కారణంగా భారీ లేఆఫ్స్ చేయాలని నిర్ణయించింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం ఈ సంస్థ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒరాకిల్ సంస్థలో సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించే దిశగా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో చేస్తున్న భారీ ఖర్చులు, ప్రస్తుతం సంస్థను తీవ్ర నగదు కొరత లోకి నెట్టడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ నెలలోనే ప్రారంభం కానున్న ఈ లేఆఫ్స్ ద్వారా సంస్థ వేల కోట్ల రూపాయలను ఆదా చేయాలని భావిస్తోంది.సామ్ ఆల్ట్‌మాన్‌కు చెందిన ాజూవనింఎ సంస్థతో కుదుర్చుకున్న వి300 బిలియన్ల భారీ భాగస్వామ్య ఒప్పందం ఓరాకిల్‌పై పెను భారాన్ని మోపింది. ఈ ఒప్పందంలో భాగంగా ఏఐ డేటా సెంటర్ల విస్తరణ కోసం ఓరాకిల్ గత రెండు నెలల్లోనే సుమారు వి58 బిలియన్ల కొత్త అప్పులు చేసింది. టెక్సాస్, విస్కాన్సిన్ వంటి ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం చేస్తున్న ఈ వ్యయం వల్ల సంస్థ మొత్తం అప్పు ఇప్పుడు వి100 బిలియన్లకు పైగా చేరింది. ఏఐ మౌలిక సదుపాయాల కోసం చేస్తున్న ఈ మితిమీరిన ఖర్చులపై ప్రస్తుతం వాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లు కూడా ఆందోళన




వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ఒరాకిల్ పలు కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ఉద్యోగుల తొలగింపు ద్వారా దాదాపు వి8 నుండి వి10 బిలియన్ల నగదును ఆదా చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. దీనితో పాటు తన క్లౌడ్ విభాగంలో నియామకాలను నిలిపివేయడమే కాకుండా, కొత్త కస్టమర్ల నుంచి 40 శాతం వరకు అడ్వాన్స్ పేమెంట్లను కోరుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితి వల్ల గత సెప్టెంబర్ నుండి ఒరాకిల్ స్టాక్ విలువ దాదాపు 54 శాతం పడిపోయి, సుమారు వి463 బిలియన్ల

మార్కెట్ క్యాప్‌ను కోల్పోయినట్లు విశ్లేషకులు గుర్తించారు. మార్చి 10న విడుదల కానున్న ఆర్థిక ఫలితాల తర్వాత ఈ లేఆఫ్స్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# ఇంధన కొరతతో గుజరాత్‌లో 50 సంస్థల మూత



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు గుజరాత్‌లోని ప్రముఖ మోర్బీ సిరామిక్ పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టాయి. ఇంధన సరఫరాలో ఏర్పడిన తీవ్ర అంతరాయం కారణంగా మోర్బీలోని మొత్తం 600 సిరామిక్ యూనిట్లలో ఇప్పటికే సుమారు 50 యూనిట్లు తమ కార్యకలాపాలను నిలిపివేశాయి. మరికొన్ని పాక్షికంగా పని చేస్తోన్నాయి. యుద్ధ ప్రభావంతో ఆర్-ఎల్ఎన్‌జి సరఫరాకు ఆటంకాలు కలగడంతో గుజరాత్ గ్యాస్ సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్లు పారిశ్రామిక వినియోగదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ఫోర్స్ మెజ్యూర్ క్లాజును ప్రయోగించాయి. ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా ప్రోపేన్ సరఫరాను నిలిపివేసింది. సిరామిక్ తయారీలో 70 నుండి 80 శాతం వరకు ప్రోపేన్‌పైనే

ఆధారపడటంతో ఈ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.హార్ముజ్ జలసంధి వద్ద ఇంధన రవాణా నిలిచిపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని మోర్బీ సిరామిక్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ కిమ్జీ కుందారియా పేర్కొన్నారు. ప్రస్తుతం పరిశ్రమ వద్ద ఉన్న నిల్వలు కొన్ని గంటల నుండి గరిష్టంగా పది రోజులకు మాత్రమే సరిపోతాయని.. గుజరాత్ గ్యాస్ కూడా గత నెల వినియోగంలో కేవలం సగం మాత్రమే సరఫరా చేస్తామని ప్రకటించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మరో వారం లేదా పది రోజుల పాటు కొనసాగితే.. మోర్బీలోని మొత్తం సిరామిక్ పరిశ్రమ మూతపడే ప్రమాదం ఉందని తయారీదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది.

# ఎగుమతిదార్లకు అన్ని విధాలా మద్దతు

పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాన్ని తట్టుకునేందుకు దేశీయ ఎగుమతిదార్లకు అన్ని రకాల విధాన, మద్దతు చర్యలను కేంద్రం చేపట్టనున్నట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. ఈ అంశాలను రోజువారీగా పరిశీలించేందుకు ఒక అంతర్ మంత్రిత్వ బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ వివరించారు. పశ్చిమాసియాకు సరకు పంపే క్రమంలో 40 అడుగుల కంటైనర్లపై యుద్ధ సర్‌ఛార్జీ కింద 4000 డాలర్ల వరకు అదనపు భారం విధిస్తున్నారని ఎగుమతిదార్లు చెబుతున్నారు. కొన్ని నౌకలు అంతర్జాతీయ జలాల్లోనే ఉండిపోయాయి. ఈ పరిణామాలు రవాణా రేట్లు, బీమా ప్రీమియాలను పెంచుతున్నాయి. పశ్చిమాసియా నుంచి 2025లో 98.7 బి. డాలర్ల (రూ.9 లక్షల కోట్లు) విలువైన వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంది. ఎగుమతులపై పడ్డ రవాణా వ్యయాలను ఎలా తగ్గించాలన్నదానిపై మంత్రిత్వ శాఖ సమాలోచనలు జరుపుతోందని గోయల్ తెలిపారు. ఎగుమతిదార్లకిచ్చే పన్ను మినహాయింపును రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ టాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్టెడ్ ప్రోడక్ట్స్ (ఆర్‌ఓడీటీఈపీ) కింద పెంచాలని, బీమా ప్రీమియం పెంచరాదని, కరోనా సమయం మాదిరిగానే రుణ పొడిగింపు వంటి చర్యలు చేపట్టాలని ఎగుమతిదార్లు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్గం మధ్యలో ఉన్న కార్గోల మళ్లింపు లేదా వెనక్కి తీసుకువచ్చేందుకు కస్టమ్స్ మద్దతు కావాలని పేర్కొన్నారు. ఆర్‌బీఐ నుంచి చెల్లింపు సర్దుబాట్లూ కోరుతున్నారు.



# క్యాబేజీ శరీరానికి మంచిదే.. కానీ

క్యాబేజీని పోషకాల పవర్‌హౌస్‌గా పరిగణిస్తారు. విటమిన్ సి, కె, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అయితే కొందరు మాత్రం దీనికి దూరంగా ఉండాలి.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. క్యాబేజీని పోషకాల పవర్‌హౌస్ అని అంటుంటారు. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గడంలో సహాయపడతాయి. క్యాబేజీ గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. అయితే, క్యాబేజీ అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలను అందించదు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తినడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణ సమస్యలు ఉన్నవారు క్యాబేజీని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇందులో ఉండే రాఫినోస్ అనే కార్బోహైడ్రేట్ జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది, దీనివల్ల ఉబ్బరం, గ్యాస్ ఏర్పడవచ్చు. కిడ్నీ స్టోన్స్ ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలతో బాధపడేవారు(ముఖ్యంగా గాయిటర్), రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు క్యాబేజీని తినే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. క్యాబేజీలోని ఆక్సాలిక్ ఆమ్లం కిడ్నీ రాళ్లను ప్రభావితం చేయగలదు. గాయిట్రోజన్‌లు థైరాయిడ్ పనితీరును దెబ్బతీస్తాయి. గుండె సమస్యల కోసం రక్తాన్ని పలుచబరిచే మందులు తీసుకునే వ్యక్తులు కూడా క్యాబేజీ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. క్యాబేజీలో విటమిన్ కె అధికంగా ఉంటుంది. విటమిన్ కె రక్తం గడ్డకట్టడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది మరియు రక్తాన్ని పలుచబరిచే మందుల



ప్రభావాన్ని తగ్గించగలదు. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, ఇటువంటి మందులు వాడే వ్యక్తులు కేవలం వైద్యుల సలహాతో మాత్రమే క్యాబేజీని తమ ఆహారంలో చేర్చుకోవాలి. అలర్జీలు, ఉబ్బసం (ఆస్తమా) ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు కూడా క్యాబేజీని మితంగా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. కొంతమందికి క్యాబేజీ తిన్న తర్వాత హిస్టామిన్ ప్రతిచర్య వల్ల చర్మంపై దద్దుర్లు, దురద లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ ప్రతిచర్యలు అరుదుగా ఉన్నప్పటికీ, జాగ్రత్త వహించడం అవసరం. చివరగా, క్యాబేజీ ఆరోగ్యకరమైన కూరగాయ అయినప్పటికీ, పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలు ఉన్న కొన్ని వర్గాల ప్రజలకు ఇది హానికరం కావచ్చు. వైద్యుడి సలహా లేకుండా ఈ సమస్యలు ఉన్నవారు క్యాబేజీని తినకపోవడం మంచిది.

# ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే..




వేసవి వచ్చిందంటే భానుడి భగభగలకు శరీరం త్వరగా అలసిపోతుంది. నీరసం, డీహైడ్రేషన్ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఇలాంటి సమయంలో ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన వరం కొబ్బరి నీళ్లు. అయితే చాలా మంది వీటిని కేవలం దాహం తీర్చుకోవడానికో లేదా సరదాకో తాగుతుంటారు. వేసవి వేడి మొదలైంది. ఎండలు మండుతుంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది కొబ్బరి నీళ్లు. అధిక చెమట, నీరసం నుంచి ఉపశమనం పొందడానికి ఇది ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే కొబ్బరి నీళ్లను ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా ఉదయం ఖాళీ కడుపుతో తాగితే కలిగే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డైటీషియన్ డాక్టర్ అనామిక కౌర్ వివరణ ప్రకారం.. కొబ్బరి నీళ్లు మన శరీరానికి ఒక నేచురల్ ఎనర్జీ డ్రింక్‌లా పనిచేస్తాయి.శరీరానికి రీ–హైడ్రేషన్: రాత్రిపూట నిద్రలో మన శరీరం కోల్పోయిన నీటిని తిరిగి నింపడానికి కొబ్బరి నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో ఉండే ఎలక్ట్రోలైట్లు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. జీర్ణక్రియ మెరుగుదల: ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ శుభ్రపడుతుంది. ఎసిడిటీ, కడుపు ఉబ్బరం

వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. బీపీ నియంత్రణ: కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. చర్మ సౌందర్యం: శరీరం నుండి విషపూరిత వ్యర్థాలను తొలగించడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. అలసట తగ్గి శరీరం పునరుజ్జీవింపబడుతుంది.నిపుణుల ప్రకారం.. రోజుకు ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు సరిపోతాయి. ఉదయం ఖాళీ కడుపుతో తాగడం అత్యంత ఉత్తమం. అయితే ఏదీ కూడా అతిగా తీసుకోకూడదు. కొబ్బరి నీళ్లు ఎక్కువగా తాగితే శరీరంలో పొటాషియం స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ.. తీవ్రమైన మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు లేదా మధుమేహంఉన్నవారు వీటిని తమ డైట్‌లో చేర్చుకునే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. కేవలం కొబ్బరి నీళ్లు తాగడమే కాకుండా.. సమయానికి నిద్రపోవడం, వ్యాయామం చేయడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం వల్ల ఈ సహజ పానీయం యొక్క పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు..

ఫిబ్రవరి నెలలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వేసవి కాలం అంటేనే వడదెబ్బ, నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యల సమాహారం. మన అజాగ్రత్త వల్ల ప్రాణాపాయ స్థితి కూడా తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే ఎండల బారి నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి ఆహారపు అలవాట్లలో, జీవనశైలిలో కొన్ని కీలక మార్పులు చేసుకోవడం అవసరం. వేసవి తాపాన్ని తట్టుకుని ఆరోగ్యంగా ఉండటానికి నిపుణులు సూచనలేంటో చూద్దాం.. సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. బయటకు వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి నెలకొంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోతే, అది వడదెబ్బకు దారితీస్తుంది. చాలా మంది దాహం వేస్తేనే నీళ్లు తాగుతారు, కానీ అది పెద్ద తప్పు. దాహంతో సంబంధం లేకుండా గంటకు ఒకసారి నీటిని తీసుకోవడం వల్ల మాత్రమే శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. ఎండాకాలంలో కేవలం నీళ్లు తాగడమే కాకుండా, మనం తీసుకునే ఆహారం కూడా మనల్ని రక్షిస్తుంది. తీసుకోవాల్సిన ఆహారాలు.. వేసవిలో శరీరానికి కావాల్సిన ప్రధాన అంశం తేమ. పుచ్చకాయలు ఈ సీజన్‌లో అమృతంలా పనిచేస్తాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా



ఉండటం వల్ల శరీరం తాజాగా ఉంటుంది. అలాగే కొబ్బరి బొండం నీళ్లు, తాజా పండ్ల రసాలు ఎలక్ట్రోలైట్లను అందిస్తాయి. మన సంప్రదాయ పానీయమైన 'మజ్జిగ'ను ప్రతిరోజూ డైట్‌లో చేర్చుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు వెంట ఒక నీళ్ల బాటిల్ ఉంచుకోవడం మర్చిపోవద్దు. మొలకెత్తిన గింజలు, తాజా ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి అందడమే కాకుండా జీర్ణక్రియ కూడా సాఫీగా సాగుతుంది. తినకూడనివి.. ఎండకాలంలో కొన్ని రకాల ఆహారాలు శరీరంలో వేడిని పెంచుతాయి. ముఖ్యంగా రాత్రి పూట జంక్ ఫుడ్, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి. మాంసాహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది,


ఇది శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. కాబట్టి మాంసాహారాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ కు గురయ్యే అవకాశం ఉంది. ఫాస్ట్ ఫుడ్స్, మళ్లీ మళ్లీ వేడి చేసిన నూనెతో చేసిన పదార్థాల వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

## మట్టికుండ నీళ్లు ఆరోగ్యానికి వరం?



ఎండాకాలం సీజన్ వచ్చేసింది. ఫిబ్రవరి చివరి వారంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఇప్పటికే చాలా మంది కూలర్లు, ఏసీల దుమ్ము దులపటం మొదలుపెట్టారు. దాంతో పాటు చల్లటి నీళ్ల కోసం కూల్‌డ్రింక్స్‌తో పాటుగా ఫ్రిజ్ వాటర్‌ను ఆశ్రయిస్తున్నారు. కానీ, ఎండాకాలంలో మట్టికుండల్లో నిల్వ ఉంచిన నీరు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మట్టి కుండలో నిల్వ చేసిన నీటిని తాగడం వల్ల మంచి లాభాలు పొందుతారని అంటున్నారు. ఎండాకాలంలో ఉదయాన్నే మట్టికుండలో నీటిని తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి. రోజు మూడు నుంచి నాలుగు లీటర్ల మట్టి కుండలో నీటిని తాగడం వల్ల విశేషమైన లాభాలు పొందుతారని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సమ్మర్‌లో మట్టికుండలో నీటిని తాగితే గ్యాస్టిక్ సమస్యలతో పాటు పొట్టకు సంబంధించిన అన్ని సమస్యలు దూరమవుతాయి. మటి కుండలో ఉంచిన నీళ్లలో సహజ మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి తాగడం వల్ల శరీరానికి మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ అందుతాయి. బాడీ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. కుండలో నీరు తాగితే శరీరానికి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు, ఆస్తమాతో బాధపడే వాళ్లు కుండ నీళ్లు తాగడం వల్ల.. ఆ సమస్యల నుంచి బయటపడొచ్చు. మట్టి కుండలో నిల్వ చేసిన నీటిని వేసవికాలంలో రోజు రెండు నుంచి మూడు లీటర్లు తాగితే శ్వాసకోశ సంబంధిత సమస్యలు కూడా తగ్గిపోతాయి. ఎండాకాలంలో ఎక్కువగా డిహైడ్రేషన్ సమస్యల బారిన పడుతూ ఉంటారు. అయితే ఈ సమస్యలను తగ్గించేందుకు కూడా మట్టికుండలో నీళ్లు క్రియాశీలక పాత్ర పోషిస్తాయి. మట్టి కుండలో నీరు సహజంగా రుచిగా ఉంటాయి. మట్టి కుండలో నిల్వ చేసిన నీళ్లు తాగటం వల్ల గ్యాస్, అసిడిటీ, శ్వాసకోశ సమస్యలు రావు. జీర్ణక్రియ కూడా మెరుగవుతుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు అంటున్నారు. మట్టి కుండలో నీరు సహజంగా రుచిగా ఉంటాయి. మట్టి కుండలో నిల్వ చేసిన నీళ్లు తాగటం వల్ల గ్యాస్, అసిడిటీ, శ్వాసకోశ సమస్యలు రావు. జీర్ణక్రియ కూడా మెరుగవుతుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు అంటున్నారు.

# రాత్రిపూట అన్నం తింటే ఏమవుతుంది..?



నేటి బిజీ లైఫ్ స్టైల్‌లో చాలా మందికి రాత్రి పూట వండుకోవడానికి తేలికగా ఉంటుందని అన్నం తినడం అలవాటు. కానీ ఈ అలవాటే మిమ్మల్ని దీర్ఘకాలిక అనారోగ్యాల పాలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేగంగా బరువు పెరగడం: బియ్యంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. రాత్రిపూట మనం శారీరక శ్రమ చేయం కాబట్టి ఆ కేలరీలు కరగవు. ఫలితంగా అవి కొవ్వుగా మారి శరీరంలో పేరుకుపోతాయి. నిద్రపోతున్నప్పుడు మెటబాలిజం నెమ్మదించడం వల్ల బరువు పెరగడం ఖాయం. చక్కెర స్థాయిలలో హెచ్చుతగ్గులు: తెల్ల బియ్యానికి గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ. అంటే ఇది రక్తంలో షుగర్ లెవల్స్‌ను ఒక్కసారిగా పెంచుతుంది. ఇది డయాబెటిస్ బాధితులకు మాత్రమే కాదు ఆరోగ్యంగా ఉన్నవారికి కూడా టైప్–2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. జీర్ణ సమస్యలు: చాలా మంది రాత్రి అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, అసిడిటీ లేదా గ్యాస్ వంటి సమస్యలతో బాధపడుతుంటారు. బియ్యం జీర్ణక్రియను నెమ్మదింపజేయడమే ఇందుకు కారణం. ఇవి తింటే మంచిది: మల్టీగ్రెయిన్ రోటీ తింటే ఫైబర్ అధికంగా ఉండటం వల్ల త్వరగా జీర్ణమవుతుంది. బియ్యంతో పోలిస్తే క్వినోవా – మిల్లెట్స్‌లో కార్బోహైడ్రేట్లు తక్కువ, ప్రోటీన్లు ఎక్కువ. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దాలియా ఫైబర్ నిధి. జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. పప్పులు, కూరగాయలతో చేసే కిచిడి తేలికైన, పోషకాలున్న ఆహారం.

## బరువు తగ్గాలనుకునే వారికి వరప్రసాదం

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఉదయాన్నే ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకోవడం అందరికీ ఒక సవాలుగా మారింది. చాలామంది సమయం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఇన్‌స్టంట్ ఫుడ్స్ తినడానికి మొగ్గు చూపిస్తున్నారు. కానీ, మన పూర్వీకులు అందించిన చిరు ధాన్యాల్లో రాగులు అత్యంత శక్తివంతమైనవి. కాల్షియం, ఐరన్, ఫైబర్ వంటి పోషకాల గని అయిన రాగులతో వంటలంటే కేవలం రాగి ముద్ద లేదా అంబలి మాత్రమే కాదు.. నోరూరించే వెరైటీలు కూడా చేసుకోవచ్చు. ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు తినాలని అందరూ చెబుతుంటారు. కానీ, రాగి అంబలి లేదా సంగటి తినడం అందరికీ నచ్చకపోవచ్చు. ముఖ్యంగా ఇంట్లో ఉండే చిన్న పిల్లలు వీటిని చూస్తేనే దూరంగా పారిపోతుంటారు. మరి రాగుల్లో ఉండే అద్భుతమైన పోషకాలు శరీరానికి అందాలంటే ఏం చేయాలి? అదే రాగి పిండితో హోటల్ స్టైల్‌లో కలర్‌ఫుల్‌గా, టేస్టీగా ఉండే ఒక అల్పాహారాన్ని సిద్ధం చేయవచ్చు. ఇది తింటే రాగులతో చేశారంటే ఎవరూ నమ్మరు.

కావలసిన పదార్థాలు: ఈ హెల్తీ బ్రేక్ ఫాస్ట్ కోసం ఒక కప్పు రాగి పిండి, అర కప్పు రవ్వ, ముప్పావు కప్పు పెరుగు సిద్ధం చేసుకోవాలి. రుచి కోసం ఒక సన్నగా తరిగిన ఉల్లిపాయ, సగం గ్రీన్ క్యాప్సికం, చిన్న అల్లం తురుము, రెండు పచ్చిమిర్చి తీసుకోవాలి. తాలింపు కోసం జీలకర్ర, ఆవాలు అర స్పూన్ చొప్పున, చిటికెడు బేకింగ్ సోడా, కొద్దిగా కరివేపాకు, కొత్తిమీర, రుచికి సరిపడా ఉప్పు, కాల్చడానికి తగినంత నూనె ఉండాలి.

తయారు చేసుకునే విధానం: ముందుగా ఒక గిన్నె తీసుకుని అందులో రవ్వ, పెరుగు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత రాగి పిండిని చేర్చి ఉండలు లేకుండా కలుపుకోవాలి. ఇప్పుడు ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికం, అల్లం తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర, ఆవాలు వేసి బాగా మిక్స్ చేయాలి. అవసరమైతే కొన్ని నీళ్లు పోసి దోశ పిండి కంటే కొంచెం మందంగా కలుపుకుని 5 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. దీనివల్ల రవ్వ మెత్తబడి ఊతప్పం సాఫ్ట్‌గా వస్తుంది. స్టవ్ మీద నాన్‌స్టిక్ తవా పెట్టి వేడి చేయాలి. ఈలోపు పక్కన పెట్టిన పిండిలో ఉప్పు, బేకింగ్ సోడా, కరివేపాకు వేసి మరోసారి కలపాలి. పెనం వేడెక్కాక కొద్దిగా నూనె రాసి, ఒక గరిటె పిండిని తీసుకుని మందపాటి ఊతప్పంలా వేయాలి. దీనిపై కొద్దిగా నూనె వేసి, మూత పెట్టి తక్కువ మంట మీద ఉడికించాలి.

రెండు వైపులా గోల్డ్ కలర్ వచ్చే వరకు క్రిస్పీగా కాల్చుకోవాలి. పైన కొత్తిమీర చల్లుకుంటే ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అంతే.. వేడివేడి రాగి ఊతప్పం సిద్ధం. దీనిని పల్లి చట్నీ, కొబ్బరి చట్నీ లేదా పెరుగుతో తింటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. షుగర్ వ్యాధితో బాధపడే వారికి రాగి ఊతప్పం ఒక బెస్ట్ ఆప్షన్. ఇది తింటే ఎక్కువ సేపు ఆకలి వేయదు, తద్వారా అనవసరమైన ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. తక్కువ సమయంలోనే ఎంతో పోషకవిలువలున్న ఈ వంటకాన్ని మీరు కూడా ఒకసారి ప్రయత్నించి చూడండి.

# భారత్ vs న్యూజిలాండ్ మధ్య ఫైనల్ ఫైట్.. నేడు కెప్టెన్ రిటైర్మెంట్?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ ఫైనల్ లో న్యూజిలాండ్ జట్టుతో భారత్ తలపడనుంది. సొంతగడ్డపై, భారీ అభిమాన సందోహం మధ్య కప్పు గెలిచేందుకు టీమిండియాకు మెరుగైన అవకాశాలే ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. ఈ మ్యాచ్ అయ్యాక ఇండియన్ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే సూర్యకుమార్ 35 ఏళ్ల వయసు పెరిగింది, ఫామ్ తగ్గింది. కెరీర్ డైలామాలో ఉంది. కాబట్టి రిటైర్మెంట్ కి ఇది సరైన సమయమే.. వరల్డ్ కప్ గెలిచి రిటైర్మెంట్ ఇవ్వడం అనేది అతడి ఇష్టం.కాగా సూర్య కుమార్ యాదవ్ ఇప్పటి వరకు టెస్టుల్లో ఒకే మ్యాచ్ ఆడాడు.. రెండేళ్లు వన్డే జట్టులో ఆడినా.. 2023 ప్రపంచకప్ ఫైనల్లో పేలవ ప్రదర్శనతో అతడిపై వేటు పడింది. ఇక అప్పటి నుంచి టీ20లకి మాత్రమే అతడు పరిమితం అయ్యాడు. ఏడాదిన్నర కిందట వెస్టిండిస్ తో టీ20 ప్రపంచకప్ గెలిచాక.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఒకేసారి టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. రోహిత్ స్థానంలో టీ20 జట్టు పగ్గాలు అందుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్. అతడి సారథ్యంలో భారత జట్టు ఒక్కటంటే ఒక్క సిరీస్ కూడా ఇప్పటి వరకు ఓడిపోకపోవడం గమనార్హం. ఇప్పుడు సొంతగడ్డపై జరుగుతున్న టీ20 పొట్టి ప్రపంచకప్ లోనూ ఫైనల్ కి చేరింది. రేపు కివీస్ తో ఫైనల్ ఆడబోతోంది. ఇందులో గెలిస్తే.. జట్టుకి ప్రపంచకప్ అందించిన కెప్టెన్ గా దిగ్గజాల జాబితాలో చేరతాడు.. టీ20 క్రికెట్ నుంచి రిటైరవ్వడానికి ఇంతకంటే మంచి ఛాన్స్ మరొకటి ఉండదు. ఒకవేళ భారత జట్టు ఫైనల్లో ఓడితే.. సూర్యకుమార్ యాదవ్ కి మరో ఛాయిస్ లేదు. అతడిపై సెలక్టర్లు వేటు వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. వాళ్లకు ఛాన్స్ ఇవ్వకూడదు అనుకుంటే.. తనే స్వయంగా రిటైర్మెంట్ ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే కెప్టెన్ అయిన దగ్గర నుంచి అతడు పెద్దగా రాణించిన దాఖలాలు లేవు. కెప్టెన్ కావడానికి ముందు సూర్య 68 మ్యాచ్లో 43.33 సగటుతో 2,340 రన్స్ చేశాడు. అందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. కానీ కెప్టెన్ అయ్యాక 41 మ్యాచ్ లలో 26.62 సగటుతో 932 రన్స్ చేశాడు. ఒక్క సెంచరీ లేదు.. కెప్టెన్ కావడం వల్లే జట్టులో కొనసాగుతున్నాడు కానీ.. ఇలాంటి ప్రదర్శన చేసిన ప్లేయర్ పై వేటు పడేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సూర్యకుమార్ ఆధ్వర్యంలో టీమిండియా వరుసగా సిరీస్ లు గెలిచిన.. అందులో అతడి పాత్ర పెద్దగా లేదని విమర్శలు వచ్చాయి. దీంతో సూర్య నిజంగానే ఫైనల్ అనంతరం రిటైర్మెంట్ ఇస్తాడా లేదా అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతుంది.

# అభిషేక్ శర్మని జట్టు నుంచి తప్పించండి.. ఫైనల్‌కి ముందు మాజీ క్రికెటర్ షాకింగ్ కామెంట్స్






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కీలక సూచన చేశాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించి రింకూ సింగ్‌కు అవకాశం ఇవ్వాలని తెలిపాడు. ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నాడు. జింబాబ్వేపై ఒక అర్ధశతకం తప్ప ఇతర మ్యాచ్‌లలో అతను పెద్దగా రాణించలేదని గుర్తు చేశాడు. బ్యాటింగ్‌లోనే కాదు, ఫీల్డింగ్‌లో కూడా అతను కొన్ని కీలక క్యాచ్‌లు వదిలేయడంతో జట్టుపై తీవ్ర ప్రభావం చూపించిందని వ్యాఖ్యానించాడు.

టీ20 వంటి చిన్న ఫార్మాట్‌లో మార్పులు చేయడం తప్పు కాదు.. వెస్టిండీస్ జట్టు కూడా ఇదే విధంగా రోస్టన్ చేజ్‌ను ఓపెనర్‌గా పంపింది అని మహమ్మద్ కైఫ్ తెలిపారు. పెద్ద మ్యాచ్ కి ముందు మార్పులు చేయడం కొన్నిసార్లు జట్టుకు ప్రయోజనం కలిగిస్తుందని వెల్లడించాడు. సంజు శాంసన్‌ను జట్టులోకి తీసుకురాగానే అతను అద్భుతంగా ఆడాడు.. ఆ మార్పుతో జట్టుకు లాభం కలిగిందన్నారు. భారత జట్టులో అనుభవజ్ఞులైన ప్లేయర్స్ చాలా మంది ఉన్నారని చెప్పుకొచ్చాడు. రింకూ సింగ్ ఎక్కడ ఆడినా పరుగులు చేసే ఆటగాడు.. టెస్టులు, రంజీ ట్రోఫీ లేదా ఐపీఎల్ అయినా అతడు తన ప్రతిభను నిరూపించుకున్నాడని పేర్కొన్నాడు. ఒక ఆటగాడు ఫామ్‌లో లేకపోతే, బయట మంచి ఫామ్‌లో ఉన్న ప్లేయర్ కి అవకాశం ఇవ్వడం తప్పు కాదని చెప్పాడు. డగౌట్‌లో రింకూ సింగ్ ఉన్నప్పుడు అతనికి ఎందుకు ఛాన్స్ ఇవ్వడం లేదని కైఫ్ ప్రశ్నించాడు. అభిషేక్ శర్మను సంజు శాంసన్‌తో పోల్చడం సరికాదని కైఫ్ అన్నారు. అభిషేక్ ఇంకా ఐసీసీ టోర్నమెంట్‌లలో కొత్త ప్లేయర్, శాంసన్ మాత్రం అనుభవజ్ఞుడైన ఆటగాడని వివరించాడు. అతడు టీ20 క్రికెట్‌లో 8000కుపైగా పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యుత్తమ హిట్టర్లలో ఒకడిగా నిలిచాడు. ఇప్పటికే స్థిరమైన ఆటగాడిగా శాంసన్ గుర్తింపు పొందాడు. కానీ అభిషేక్ శర్మ ఇంకా యంగ్ క్రికెటర్ మాత్రమే.. తన ఆటను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరో ఆటగాడు వరుణ్ చక్రవర్తి ప్రదర్శనపై కూడా చర్చ జరుగుతున్నప్పటికీ అతన్ని జట్టు నుంచి తప్పించే అవకాశం తక్కువగా ఉందని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తెలిపాడు. వరుణ్ చక్రవర్తి వచ్చే మ్యాచ్‌లో తన బౌలింగ్ లైన్‌ను మార్చి మెరుగ్గా బౌలింగ్ చేసే ఛాన్స్ ఉందన్నాడు.

# టీ20 ప్రపంచ కప్ ఫైనల్స్‌లో టీమిండియా రికార్డులు..




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరిన భారత జట్టు మరోసారి చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచింది. న్యూజిలాండ్‌తో జరగనున్న ఈ ఫైనల్ పోరుతో టీమిండియా టీ20 ప్రపంచకప్ చరిత్రలో నాలుగోసారి ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇప్పటి వరకు ఇండియన్ టీమ్ మూడు సార్లు ఫైనల్ ఆడగా, అందులో రెండు సార్లు టైటిల్‌ను దక్కించుకుంది. ఈసారి కూడా ట్రోఫీని గెలిచి ప్రపంచ క్రికెట్ లో అధిపత్యం ప్రదర్శించాలని చూస్తుంది.

**2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన మొదటి టోర్నమెంట్ 2007లోనే భారత్ ఫైనల్‌కు చేరుకుంది. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని యువ భారత జట్టు అద్భుత ప్రదర్శనతో పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఐదు పరుగుల తేడాతో విజయం సాధించి మొదటిసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అతడు 54 బంతుల్లో 75 పరుగులు చేసి భారత జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు.

**2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీమిండియా రెండోసారి 2014లో టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరింది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలోని షేర్---ఎ---బంగ్లా నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ విజయంతో శ్రీలంక తన తొలి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకుంది.

**2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

2024లో భారత్ మూడోసారి ఫైనల్‌కు చేరి దక్షిణాఫ్రికాపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో టీమిండియా రెండోసారి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అద్భుతమై ఇన్నింగ్స్ ఆడాడు. 76 పరుగులు చేసి టీమిండియా జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ప్రదర్శనకు గాను అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరించింది.

**2026లో చరిత్ర సృష్టించే ఛాన్స్:**

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి ఫైనల్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌తో జరిగే ఈ తుది పోరులో విజయం సాధిస్తే టీమిండియా మరో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా టైటిల్‌ను కాపాడుకున్న తొలి జట్టుగా నిలవనుంది.

# దళపతి 'జన నాయగన్' కోసం ఆ ముగ్గురు!



ప్రగ్యా జైస్వాల్ ఎల్లప్పుడూ మంచి సూర్యాస్తమయాన్ని అభినందిస్తూ ఉంటుంది



మృణాల్ ఠాకూర్ సొగసైన బ్లాక్ చీర లుక్‌లో స్టన్స్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి కథనాయకుడిగా నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ -జన నాయగన్-. ఈ మూవీని ఏ క్షణాన మొదలు పెట్టారో కానీ అడుగడుగున ఇబ్బందులే తలెత్తుతున్నాయి. ఇంత వరకు ఏ స్టార్ హీరో సినిమాకు రాని ఇబ్బందులు ఈ మూవీకి ఎదురవుతున్న విషయం తెలిసిందే. విజయ్ నటించిన చివరి సినిమా సాఫీగా రిలీజ్ అవుతుందని అభిమానులు, ఇన్నేళ్లు స్టార్ హీరోగా అభిమానుల్ని అలరించిన కథానాయకుడిగా గ్రాండ్‌గా ఫేర్‌వెల్ ఇవ్వాలని మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్ కోసం ప్లాన్ చేసుకోవడం తెలిసిందే.జనవరి 9న పొంగల్ బరిలో భారీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే సెన్సార్ బృందం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సినిమా రిలీజ్ వాయిదాపడి అంతరిని షాక్‌కు గురి చేసింది. మేకర్స్ షాక్ నుంచి తేరుకుని మద్రాస్ హైకోర్టుని ఆశ్రయించడం, కోర్టు సెన్సార్ వారిని మందలించి సర్టిఫికెట్ జారీ చేయాల్సిందేనని తీర్పు చెప్పడంతో అభిమానులు, మేకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇక సినిమా రిలీజ్‌కు ఎలాంటి అడ్డంకులు లేవని సంబరాలు చేసుకున్నారు.



ఇక్కడే డామిట్ కథ అడ్డంతిరిగింది. సీబీఎఫ్‌సీ వర్గాలు మద్రాస్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుని సవాల్ చేయడంతో మళ్లీ కథ మొదటికొచ్చి -జన నాయగన్- రిలీజ్ ఆగిపోయింది. ఫైనల్‌గా సినిమా చుట్టూ జరుగుతున్న వివాదాన్ని అర్థం చేసుకున్న మేకర్స్ సెన్సార్ వారికి వ్యతిరేకంగా వేసిన పిటీషన్‌ని రిటర్న్ తీసుకుని వారు అడిగిన కట్స్‌కు అంగీకారం తెలుపుతూ ఫైనల్ కట్‌ని రివైజింగ్ కమిటీకి పంపించి గత కొన్ని రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఫైనల్‌గా రివైజింగ్ కమిటీ నుంచి మేకర్స్‌కి మెయిల్ వచ్చేసింది.మార్చి 9న మధ్యాహ్నం 2 గంటలకు సినిమాని రివ్యూ చేస్తామని ప్రకటించారు. దీంతో కేవీఎన్ ప్రొడక్షన్ వర్గాల్లో కొత్త ఉత్సాహం మొదలైంది. రివైజింగ్ కమిటీ సినిమా చూసి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వబోతోంది. మార్చి 9న కానీ, లేదా రెండు మూడు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేస్తే సినిమాని ఇదే నెలలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే దళపతి కోసం ముగ్గురు స్టార్ డైరెక్టర్లు రంగంలోకి దిగినట్టుగా తెలుస్తోంది. విజయ్‌తో భారీ సినిమాలని అందించిన లోకేష్ కనగరాజ్, అట్లీ, నెల్సన్ దిలీప్ కుమార్ ఈ మూవీలోని ఓ కీలక ఘట్టంలో అతిథి పాత్రల్లో కనిపించనున్నారని తెలిసింది. విజయ్ చివరి సినిమా కావడంతో ఈ ముగ్గురు డైరెక్టర్లు ఇందులో అతిథి క్యారెక్టర్లలో కనిపిస్తారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఇదిలా ఉంటే తెలుగు సూపర్ హిట్ ఫిల్మ్ -భగవంత్ కేసరి- ఆధారంగా ఈ మూవీని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇంత వరకు ఆ విషయాన్ని అధికారికంగా అంగీకరించని మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీ డిటైల్స్‌లలో ఇది -భగవంత్ కేసరి- రీమేక్ అని ప్రకటించడం గమనార్హం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965